RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:212 | ఆదివారం | 06 సెప్టెంబర్ 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizamabad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

PRESS

77309 83966 98491 98098

# మా పాలన భేష్

**25.35** లక్షల మంది రైతులకు రుణమాఫీ

- బీఆర్ఎస్ పదేళ్ల పాలన కంటే మెరుగైన పాలన
- రైతు భరోసా, వరి రైతుల ఖాతాల్లో రూ.1.26 లక్షల కోట్లు
- రెండేళ్లలో 72 వేల ఉద్యోగాల భర్తీ
- 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చడమే లక్ష్యం
- సీఎం రేవంత్ రెడ్డి
- అసెంబ్లీకి వచ్చి తమ పాలనపై చర్చించాలి
- నకిరేకల్ సభలో కేసీఆర్, కేటీఆర్‌లకు సీఎం సవాల్

2







## ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు

- విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు వేసేది గురువులే
- ప్రభుత్వ విద్యను ప్రైవేట్‌కు దీటుగా బలోపేతం చేస్తాం
- సీఎం రేవంత్ రెడ్డి
- కొడంగల్‌లో పాఠశాల భవనం, క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం

2

## హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

- రూ.70 వేల కోట్ల పెట్టుబడి, 7 వేల మందికి ఉపాధి
- తెలంగాణకే కాక దేశానికి ఇది చరిత్రాత్మక ప్రాజెక్టు
- టీసీఎస్-హైపర్‌వాల్ట్ ప్రతినిధులతో సీఎం సమావేశం

2

# కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి?

## వెయ్యి రోజులు మోసం చేసిన రేవంత్ తప్పుకోవాలి

- నిరుద్యోగులను నిండా ముంచారు
- 2006లో కేసీఆర్ రాజీనామా చేస్తే కాంగ్రెస్ వీపు పగిలింది
- చేసిన మోసాలకు కాంగ్రెస్ నాయకులు 420 సార్లు రాజీనామా చేయాలి
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- మెక్కడం తప్ప కాంగ్రెస్ నేతలు చేసిందేమీ లేదు
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**కరీంనగర్, సెప్టెంబర్ 5 :**

'తిన్నది అరగక కేసీఆర్ రాజీనామా చేయాలని తీట మాటలు మాట్లాడుతున్నరు.. నేను అడుగుతున్నా.. ఎవరు రాజీనామా చేయాలని.. రాజీనామా ఎందుకు చేయాలి? తెలంగాణ తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా? రేవంత్ రెడ్డి అనే బట్టేబాజ్ గాడు రాజీనామా చేయాలా అని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. 100 రోజులు అని చెప్పి వెయ్యి రోజులు మోసం చేసిన దొంగబాజ్ గాడు రాజీనామా చేయాలన్నారు. కాంగ్రెస్ వెయ్యి

మిగతా 3వ పేజీలో..




## భవిష్యత్తు డేటా, ఏఐ రంగాలదే

- కాన్‌స్టర్ నూతన కార్యాలయం ప్రారంభించిన కేటీఆర్
- టైర్-2, 3 నగరాల యువతలో అపారమైన ప్రతిభ, పట్టుదల

3

## ఎలక్ట్రానిక్ జాకార్డ్‌తో కొత్త హ్యాండ్‌లూమ్ మగ్గం ఆవిష్కరణ

- సిరిసిల్ల నేతన్నకు కేటీఆర్ ప్రశంసలు.. 'వెండి వెన్నెల' చీర ఆవిష్కరణ
- అధికారంలోకి వస్తే కర్మాగారం నెలకొల్పుతాం: కేటీఆర్ హామీ

3



## మోదీ 'జెన్‌జీ' మాటలతో సందడి

- ఎస్ఆర్‌సీసీ శతాబ్ది వేడుకల ముగింపు సభలో ప్రధాని ప్రసంగం
- 'OG', 'ఫ్లెక్స్' అంటూ విద్యార్థుల్లో ఉత్సాహం
- 2013 నాటి 'సగం నిండిన గ్లాస్' ప్రసంగం గుర్తుచేసుకున్న మోదీ
- ప్రపంచ స్థాయి సంస్థలుగా భారత కంపెనీలు ఎదగాలని పిలుపు

4

## యూస్‌మార్గ్‌లో లష్కరే కమాండర్ హతం

- భద్రతా బలగాల సంయుక్త ఆపరేషన్
- ఎదురుకాల్పుల్లో యాసిర్ మృతి
- 53 రాష్ట్రీయ రైఫిల్స్, స్పెషల్ ఫోర్సెస్ గాలింపు
- స్థానిక నెట్‌వర్క్‌పై దర్యాప్తు ముమ్మరం
- సులైమాన్ మూసా గ్రూప్‌తో గతంలో సంబంధాలు

4

# వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పక్కా ప్రణాళిక

- రూ.18,250 కోట్లతో 65 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు
- అక్టోబర్ 15 నుంచి కొనుగోళ్లు ప్రారంభం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 :**

రాబోయే వానాకాలం సీజన్‌లో రూ.18,250 కోట్ల అంచనా విలువతో 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ కార్యాచరణను అమలు చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 15 నుంచి కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యం

మిగతా 3వ పేజీలో..





## అసెంబ్లీ సమావేశాలకు సహకరించాలి

- సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు సత్వరం అందించాలి
- చర్చ సమయంలో అధికారులు అందుబాటులో వుండాలి
- మెటీరియల్‌ను ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ భాషల్లో ప్రచురించాలి
- శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

2

## 22ఏలో చేర్చడం మానవ హక్కుల ఉల్లంఘనే

3

## రోడ్లపై వంటావార్పుతో తెలంగాణ వచ్చింది

- రేవంత్‌రెడ్డి హయాంలో మళ్లీ అదే ఖర్మ పట్టింది
- రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి
- కేసీఆర్ పాలనలో 24 గంటలు కరెంట్ వుండేది
- ఇప్పుడు పొద్దున లేస్తే కరంటు కోసం ఫోన్లు
- యూరియా దొరక్క రైతుల పాట్లు
- అన్నీ పక్కాగా రావాలంటే కేసీఆర్ సీఎం కావాలి
- మాజీ మంత్రి హరీష్‌రావు




**దుబ్బాక, సెప్టెంబర్ 5 :**

మా తెలంగాణ మాకు కావాలని రోడ్ల మీద వంటా వార్పు చేస్తే తెలంగాణ వచ్చింది. పదేళ్లు కేసీఆర్ నాయకత్వంలో అంతా చల్లగా ఉన్నాం. కానీ, ఈ రేవంత్ రెడ్డి పుణ్యమా అని రైతులు మళ్లీ వంటా వార్పుతో రోడ్ల మీదకు ఎక్కాల్సిన ఖర్మ పట్టిందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. రైతు సమస్యలపై, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై

మిగతా 3వ పేజీలో..



## కులగణనపై కేంద్రం యూటర్న్

- ఓబీసీ కులగణనపై కాంగ్రెస్ దేశవ్యాప్త ఉద్యమం
- తెలంగాణ తరహా కులగణనను దేశమంతా చేపట్టాలి
- సామాజిక న్యాయం, న్యాయమైన వాటా కోసం పోరాటం
- రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగించాలి

2



## హనీట్రాప్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

2

- డేటింగ్ యాప్ పరిచయంతో రూ.14.75 లక్షలు మోసం



# హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 :**

హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ప్రకటించింది. అందుకు సంబంధించి ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. టీసీఎస్ ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో సచివాలయంలో శనివారం సమావేశమైంది. హైదరాబాద్‌లో 250 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఒక గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో ఈ అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. హైపర్‌వాల్ట్‌తోపాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణకు దాదాపు రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు ఏడు వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నారు. దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకే కాక దేశానికి ఇది చరిత్రాత్మక ప్రాజెక్టు అని అన్నారు. ఏఐ మోడల్స్, కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలక ప్రజా మౌలిక వసతులుగా మారనున్న తరుణంలో ఆ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులో ఉండటం రాష్ట్రానికి గొప్ప ప్రయోజనమని అన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన టీసీఎస్ ప్రతినిధులను ముఖ్యమంత్రి అభినందించారు. టీసీఎస్ ఈ నిర్ణయంతో తన కల నెరవేరిందని అభిప్రాయపడ్డారు. ఆశించిన విధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడిందన్నారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతో పాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని చెప్పారు. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్‌న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం ప్రభుత్వం టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చింది. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీసీఎస్ సీఈఓవో కె.కృతివాసన్, సీవోవో ఆర్తి సుబ్రమణియన్, హైపర్‌వాల్ట్ ప్రెసిడెంట్ వి.రాజన్న, హైపర్‌వాల్ట్ సీఈవో, ఎండీ దీపేష్ నందా సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా నుంచి ఒపెన్ ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె.శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

# కులగణనపై కేంద్రం యూటర్న్

**హైదరాబాద్, సెప్టెంబర్ 5:**

ఓబీసీ కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వం యూటర్న్ తీసుకున్నదని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు కొప్పుల రాజు ఆరోపించారు. కేంద్రం వెంటనే ఓబీసీ కులగణన చేపట్టాలని, ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పెద్ద ఉద్యమం చేపడుతుందని స్పష్టం చేశారు. సరైన గణన, కచ్చితమైన గణాంకాలు, న్యాయమైన వాటా, సామాజిక న్యాయం కోసం తమ పార్టీ పోరాడుతుందని తెలిపారు. శనివారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**కేంద్రం హామీపై విమర్శలు**

గత ఐదేళ్లుగా కాంగ్రెస్, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారని కొప్పుల రాజు తెలిపారు. ఈ అంశాన్ని దేశవ్యాప్త ఉద్యమంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించిందన్నారు. జనాభా లెక్కలతో పాటు ఓబీసీ కులగణన చేపడతామని బిహార్ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ చెప్పారని, అయితే ప్రస్తుతం జనాభా లెక్కల్లో ఓబీసీ కులగణనకు కేంద్రం అవకాశం కల్పించడం లేదని ఆరోపించారు. ఫ్యామిలీ సర్వేతో పాటు ఓబీసీ కులగణన చేస్తామని పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పారని, కానీ అందుకు సంబంధించిన ఫారంలో ఓబీసీ ప్రస్తావన లేదని అన్నారు.

**తెలంగాణ మోడల్‌పై ప్రస్తావన**

తెలంగాణలో కులగణన సందర్భంగా ఓబీసీ కుల సంఘాలతో చర్చించి 134 ఓబీసీ కులాలను గుర్తించామని కొప్పుల రాజు తెలిపారు. రాష్ట్రంలో శాస్త్రీయంగా కులగణన నిర్వహించామని పేర్కొన్నారు. ఓబీసీల్లో ఎన్ని కులాలు ఉన్నాయనే లెక్క తేల్చడం సాధ్యం కాదన్న వాదన సరికాదన్నారు. పదేళ్లుగా ఓబీసీ సామాజిక న్యాయ అజెండా నెరవేరడం లేదని విమర్శించారు. ఓబీసీ డేటా ఖరారైతే రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ ఎత్తివేయాలని సీడబ్ల్యూసీలో నిర్ణయించామని చెప్పారు.

**మహిళా రిజర్వేషన్లలోనూ వాటా**

మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు తగిన ప్రాతినిధ్యం దక్కకుండా పోయే అవకాశం ఉందని కొప్పుల రాజు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తెలంగాణలో కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించినప్పుడు ఓబీసీ డేటా లేకుండా చేశారని ఆరోపించారు. ఓబీసీ హక్కుల కోసం ఏఐసీసీ 100 రోజుల కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. తెలంగాణ నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఏఐసీసీ ప్రచారం చేస్తోందన్నారు. దేశ జనాభాలో 50 శాతం ఉన్న వర్గాల వద్ద కేవలం 3 శాతం సంపద ఉందని పేర్కొంటూ.. పెద్ద కాంట్రాక్టులు ఎవరి చేతుల్లోకి వెళ్తున్నాయో గమనించాలని సూచించారు.

**తెలంగాణ దేశానికి రోల్ మోడల్**

తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి శాస్త్రీయంగా కుల సర్వే నిర్వహించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. తెలంగాణ కులగణన దేశానికి రోల్ మోడల్‌గా మారిందన్నారు. బీసీ హక్కుల కోసం దేశవ్యాప్తంగా 100 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ దేశ భౌగోళిక, సామాజిక పరిస్థితులను అర్థం చేసుకున్నారని, 'ఎవరి జనాభా అంత వారికి భాగస్వామ్యం' అనే నినాదంతో ముందుకు సాగారని తెలిపారు. ఆ నినాదం ఇప్పుడు ఉద్యమంగా మారిందన్నారు.

**సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబాటు**

కులగణన సర్వే వివరాలను బహిరంగంగా అందుబాటులో ఉంచామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలో ఉండాలా వద్దా అనే విషయంపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయం తీసుకోవాలని వ్యాఖ్యానించారు. బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, పాయల్ శంకర్ తమ పార్టీ అధిష్ఠానాన్ని ఒప్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధిష్ఠానంపై మాట్లాడితే పదవులు పోతాయనే భయంతో ఉన్నారా అని ప్రశ్నించారు.

**బిహార్ ఎన్నికల తర్వాత మాట తప్పారు**

బిహార్ ఎన్నికలకు ముందు దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని 2025 ఏప్రిల్ 1న కేంద్రం ప్రకటించిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎన్నికల తర్వాత కేంద్రం మాట తప్పిందని ఆరోపించారు. కులగణనపై ఏఐసీసీ చేపట్టిన 100 రోజుల కార్యక్రమాన్ని తెలంగాణలో విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు.

# మా పాలన భేష్



**నకిరేకల్, సెప్టెంబర్ 5:**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి వేగంగా ముందుకు సాగాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా నకిరేకల్‌లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. 25.35 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేశామని తెలిపారు. గత 32 నెలల్లో రూ.36 వేల కోట్లు రైతు భరోసా కింద, రూ.90 వేల కోట్లు వరి రైతుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని చెప్పారు.

**మహిళలకు ఆర్థిక స్వావలంబన**

మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ ఉచిత ప్రయాణానికి రూ.11 వేల కోట్లు చెల్లించామని రేవంత్ రెడ్డి తెలిపారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే లక్ష్యంతో వెయ్యి మెగావాట్ల సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఇందిరా మహిళా శక్తి స్టాల్స్ కేటాయిస్తున్నామని చెప్పారు.

**సంక్షేమానికి ప్రాధాన్యం**

కేవలం రెండేళ్లలోనే 72 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని సీఎం తెలిపారు. ఉద్యమకారులు, బలహీనవర్గాల నాయకులకు తమ ప్రభుత్వం పదవులు కల్పించిందన్నారు. రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం, 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు వివరించారు.

**విపక్షాలకు సవాల్**

ఫామ్‌హౌస్‌లకే పరిమితం కాకుండా అసెంబ్లీకి వచ్చి తమ ప్రభుత్వ పాలనపై చర్చించాలని కేసీఆర్, కేటీఆర్‌లకు రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రికి ఘన స్వాగతం**

నకిరేకల్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌లకు ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బాలు నాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామేల్, పార్టీ నాయకులు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు.

**అభివృద్ధి పనులకు శ్రీకారం**

నకిరేకల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఏరియా ఆసుపత్రిని ప్రారంభించారు. నియోజకవర్గంలో రూ.9.85 కోట్లతో నిర్మించే తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనానికి, నకిరేకల్ మండలం కడపర్తిలో రూ.200 కోట్లతో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు.

మునిపంపుల గ్రామంలో రూ.3.62 కోట్లతో చేపట్టే ట్రాన్స్‌ఫార్మర్, 33/11 కేవీ సబ్‌స్టేషన్, 33, 11 కేవీ విద్యుత్ లైన్లు, కంట్రోల్ రూమ్ పనులకు శంకుస్థాపన చేశారు. కేతేపల్లి మండలం గుడివాడలో రూ.2.74 కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్లను ప్రారంభించారు. నకిరేకల్ మండలంలో రూ.20 కోట్లతో నిర్మించే సమీకృత మండల స్థాయి కార్యాలయాల సముదాయానికి శంకుస్థాపన చేశారు.

**రోడ్ల అభివృద్ధికి నిధులు**

రూ.45.60 కోట్లతో చేపట్టే పలు రహదారి అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. నకిరేకల్-గురజాల రోడ్డు నుంచి బైరౌనిబండ వరకు, బైరౌనిబండ నుంచి అమ్మనబోలు-రామాంజాపూర్ రోడ్డు వరకు రహదారి పనులు, అమ్మనబోలు-రామాంజాపూర్ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు ఇందులో ఉన్నాయి. నకిరేకల్‌లో రూ.1.10 కోట్లతో నిర్మించే ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ భవనానికి కూడా శంకుస్థాపన చేశారు.

**ఎస్ఎల్‌బీసీనే శాశ్వత పరిష్కారం**

దక్షిణ తెలంగాణలో జల కష్టాలకు శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గం (ఎస్ఎల్‌బీసీ) శాశ్వత పరిష్కారమని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఫ్లోరైడ్ బాధితులకు ఈ ప్రాజెక్టు సంజీవని లాంటిదని పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి రైతులకు నీరందిస్తామని తెలిపారు.

**జూన్ 2028 నాటికి పూర్తి**

ఎన్ని అవరోధాలు ఎదురైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను వేగవంతం చేసి జూన్ 2028 నాటికి పూర్తి చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. దిండి ప్రాజెక్టుకు సీఎం రూ.1,800 కోట్లు మంజూరు చేశారని, దానితో పాటు బ్రాహ్మణ వెల్లంల, పెండింగ్ కాలువల పనులను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. మూసీ ఆయకట్టుకు అవసరమైన సాగునీటిని సమృద్ధిగా విడుదల చేస్తామని తెలిపారు.

**కాంగ్రెస్‌కు నల్లగొండ కంచుకోట**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ నెలకు 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నామని, పేదలకు కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి ఎప్పటికీ కంచుకోటగా ఉంటుందని, సంక్షేమం, అభివృద్ధితో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

# ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు

**కొడంగల్, సెప్టెంబర్ 5 :**

విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే అసలైన పునాదులు వేస్తారని, దేశ భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తల్లిదండ్రుల కంటే విద్యార్థులు ఉపాధ్యాయుల వద్దనే ఎక్కువ సమయం గడుపుతారని, సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పిన విధంగా సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమైనదని కొనియాడారు. విద్యాభివృద్ధిలో గతంలో 28వ స్థానంలో ఉంటే ప్రజా ప్రభుత్వం వచ్చాక 17వ స్థానానికి చేరుకుంది.. ఇది ఉపాధ్యాయుల కృషితోనే సాధ్యమైంది అని అన్నారు .ఈ రెండేళ్లల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 88 వేలు పెరిగిందని, ఈ విజయం మీది.. తెలంగాణ ప్రజలది అని చెప్పారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో 95 శాతం అడ్మిషన్లు జరిగాయన్నారు. సాంకేతిక విద్యలో తెలంగాణ వేగంగా ముందుకెళుతోందన్నారు.

**రోడ్డెక్కవద్దు.. సమస్యలు పరిష్కరిస్తా**

55 రోజుల్లోనే డీఎస్సీ ద్వారా 10,006 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతోపాటు 25,950 మందికి ప్రమోషన్లు, 34,706 మందికి పారదర్శకంగా బదిలీలు చేపట్టామని గుర్తుచేశారు. ఉపాధ్యాయులు రోడ్డెక్కడం రాష్ట్రానికి శుభసూచకం కాదని, వారికి ఎలాంటి చిన్న సమస్య రాకుండా చూసుకునే బాధ్యత తనదేనని సీఎం హామీ ఇచ్చారు. ఆర్థిక వెసులుబాటును బట్టి సమస్యలన్నీ పరిష్కరిస్తానని, విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు తనకు రెండేళ్ల సమయం ఇవ్వాలని కోరారు. ప్రైవేటుకు దీటుగా నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ విద్యా వ్యవస్థను తీర్చి దిద్దుతామని స్పష్టం చేశారు. 317 జీవో సమస్యను పరిష్కరించాం.. విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని, కే కేశవరావును సలహాదారుగా నియమించి విద్యాశాఖ సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎడ్యుకేషన్ పాలసీని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం.. మీ సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వంపై మీ అభిప్రాయం మార్చుకోవద్దు అని కోరారు. మేం అధికారంలోకి రాగానే పీఆర్సీ ఇచ్చామని, మళ్లీ ఇప్పుడు పీఆర్సీ ఇవ్వాలని శ్రీపాల్ అంటున్నాడని అన్నారు. మీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా మీ సర్వీస్ ను 60 ఏళ్లకు గత పాలకులు పెంచారని, మీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెండింగ్ పెట్టి వెళ్లి ఆయన ఫామ్ హౌస్ లో పడుకున్నారని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ప్రజా ప్రభుత్వం రూ.6 వేల కోట్లు చెల్లించిందని చెప్పారు. ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వ ఖర్చులతో విదేశాలకు పంపి విద్యా విధానం అధ్యయనం చేయించారా? తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయులను విదేశాలకు పంపింది నిజం కాదా అని అడిగారు. ఉపాధ్యాయుల కు గుర్తింపు ఇవ్వాలని, వారిని గౌరవించాలని 123 మంది టీచర్లకు అవార్డులు అందిస్తున్నామన్నారు.

**కొడంగల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు**

అంతకుముందు కొడంగల్‌లో మండల పరిషత్, జెడ్పీ బాలికల పాఠశాల నూతన భవనం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ క్రిటికల్ కేర్ బ్లాక్, గెస్ట్ హౌస్‌లను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

**ఓట్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలి**


కొడంగల్ లోని తన నివాసంలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ కలసి రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల ఓట్లను, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రతి బూత్ స్థాయిలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ఒక్క పేదవాడి ఓటు కూడా తొలగింపునకు గురికాకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# అసెంబ్లీ సమావేశాలకు సహకరించాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 :**

సోమవారం నుండి ప్రారంభం కానున్న రాష్ట్ర శాసనసభ, శాసన పరిషత్ వర్షాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు అధికార్లు సహకరించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. ఈ నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారుల తో శనివారం శాసన పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించిన ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ, శాసనసభ అధికారులు, సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు. గతంలో లాగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలి. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలి. సభ్యులకు అందించే మెటీరియల్ ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో ముందస్తుగా సమర్పిస్తే సభ్యులు చదువుకుని సమావేశాలకు హాజరవుతారు. శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలి. శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరుపున అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సభ లోపల, బయట కూడా ప్రశాంత వాతావరణం ఉంటేనే సమావేశాలు సజావుగా జరుగుతాయని గుర్తుచేశారు. తెలంగాణ పోలీసు శాఖకు దేశ వ్యాప్తంగా సమర్థవంతమైనదిగా పేరుంది. ఈసారి సమావేశాలు కూడా విజయవంతంగా జరగడానికి అవసరమైన రక్షణ,బందోబస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నాన్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మాదిరిగా కాకుండా ఇంకా వేగంగా అధికారులు పని చేయాలన్నారు.

సమావేశాలు జరిగే సమయంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలి. నోడల్ అధికారులను నియమించి , సమావేశాలు సక్రమంగా నిర్వహించాలి. ఈ సారి సమావేశాలు హాట్ హాట్ గా జరిగే అవకాశం ఉంది. పోలీస్ శాఖ చాలా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇంటెలిజెన్స్ అధికారులు త్వరగా సమాచారం అసెంబ్లీ అధికారులకు అందించాలి. ధర్నాలు , రాస్తారోకోలు జరగకుండా ప్రశాంతంగా సమావేశాలు జరిగేలా అధికారులు చూడాలన్నారు. శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ చైర్మన్, స్పీకర్ సూచనలను ఖచ్చితంగా అమలు చేయాలి. ఒకరోజు ముందే సంబంధిత ప్రశ్నలకు జవాబులను అందజేయాలి. ఉభయ సభల సమావేశాల సమయంలో ప్రభుత్వం బాధ్యతగా ఉంటూ పూర్తి స్థాయిలో సహకరిస్తాం. ప్రతి శాఖ తరుపున ఒక అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు ఉభయ సభల సమావేశాలు నిదర్శనం. అందుకే ప్రభుత్వ యంత్రాంగం తరుపున పటిష్టమైన చర్యలు తీసుకుని సమావేశాలు విజయవంతంగా జరపడానికి సహకరిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుగా, డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ , కౌన్సిల్ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, శాసన పరిషత్ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, డిజిపి సివి ఆనంద్, ప్రిన్సిపల్ సెక్రటరీ హోం) శిఖా గోయల్, లా అండ్ ఆర్డర్ డీజీ మహేష్ భగవత్, అడిషనల్ డీజీ(ఇంటెలిజెన్స్) విజయకుమార్, సిటీ కమిషనర్ విసి సజ్జనార్, ఇంటెలిజెన్స్ఐ జీ కార్తికేయ, అసెంబ్లీ, కౌన్సిల్ చీఫ్ మార్షల్స్ కర్ణాకర్, సంజీవ రెడ్డి తదితరులు కూడాపాల్గొన్నారు.



# హనీట్రాప్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

- డేటింగ్ యాప్ పరిచయంతో రూ.14.75 లక్షలు మోసం
- 'లావణ్య' పేరుతో వల వేసిన నిందితుడు
- తమిళనాడు సేలంలో నిందితుడి అరెస్టు
- ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

**వరంగల్, సెప్టెంబర్ 5 :**

డేటింగ్ యాప్‌లో పరిచయమైన మహిళ పేరుతో ఓ వ్యక్తి వేసిన హనీట్రాప్‌లో పడి వరంగల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రూ.14.75 లక్షలు పోగొట్టుకున్నాడు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని తమిళనాడులోని సేలం జిల్లాలో అదుపులోకి తీసుకున్నారు.

**డేటింగ్ యాప్‌లో పరిచయం**

వరంగల్‌కు చెందిన తుమ్మ ఉదయ్ కిరణ్‌కు వై99 డేటింగ్ యాప్‌లో 'లావణ్య' పేరుతో ఓ మహిళ పరిచయమైంది. కొంతకాలానికి పరిచయం స్నేహంగా మారడంతో ఇద్దరూ తరచూ చాటింగ్ చేసుకున్నారు. ఈ క్రమంలో లావణ్య పేరుతో ఉన్న వ్యక్తి డబ్బులు కావాలని అడగడంతో ఉదయ్ కిరణ్ పలు దఫాలుగా యూపీఐ, ఇతర మార్గాల ద్వారా మొత్తం రూ.14.75 లక్షలు పంపించాడు.

**మహిళ పేరుతో మోసం**

చివరకు తాను మోసపోయినట్లు గుర్తించిన ఉదయ్ కిరణ్ వరంగల్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇది హనీట్రాప్ వ్యవహారమని గుర్తించారు. లావణ్య పేరుతో ఓ వ్యక్తి బాధితుడిని వలలోకి దించి వివిధ బ్యాంకు ఖాతాలు, యూపీఐ లావాదేవీల ద్వారా రూ.14 లక్షలకు పైగా దోచుకున్నట్లు నిర్ధారించారు.

**సేలంలో నిందితుడి అరెస్టు**

సాంకేతిక ఆధారాలతో నిందితుడు తమిళనాడులోని సేలం జిల్లాలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగింది. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కె. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది శివకృష్ణ, దినేశ్, భరత్, జహూర్ మొహమ్మద్ నిందితుడి పట్టివేతలో కీలకంగా వ్యవహరించారు.

**అప్రమత్తంగా ఉండాలి**

డేటింగ్ యాప్‌లు, సోషల్ మీడియా ద్వారా పరిచయమయ్యే వ్యక్తుల మాటలు నమ్మి డబ్బులు పంపవద్దని పోలీసులు సూచించారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులు అత్యవసర పరిస్థితులు, వ్యక్తిగత అవసరాల పేరుతో డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

# ఎలక్ట్రానిక్ జాకార్డ్‌తో కొత్త హ్యాండ్‌లూమ్ మగ్గం ఆవిష్కరణ

- సిరిసిల్ల నేతన్నకు కేటీఆర్ ప్రశంసలు
- 'వెండి వెన్నెల' చీర ఆవిష్కరణ
- అధికారంలోకి వస్తే కర్మాగారం నెలకొల్పుతాం
- కేటీఆర్ హామీ

**సిరిసిల్ల, సెప్టెంబర్ 5:**

చేనేత రంగంలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ కొత్త తరహా హ్యాండ్‌లూమ్ మగ్గాన్ని రూపొందించిన నేతన్న నల్లా విజయ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. విజయ్ ఆహ్వానం మేరకు సిరిసిల్లలోని ఆయన ఇంటికి వెళ్లిన కేటీఆర్.. ఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన కొత్త హ్యాండ్‌లూమ్ మగ్గాన్ని పరిశీలించి ఆవిష్కరించారు. ఈ మగ్గంపై రూపొందించిన 'వెండి వెన్నెల' చీరను కూడా కేటీఆర్ ఆవిష్కరించారు. ఒకప్పుడు సిరిసిల్లలో అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసిన మహానుభావుడు నల్లా పరంధాములు అని కేటీఆర్ గుర్తుచేశారు. ఆయన కళా నైపుణ్యం ప్రపంచవ్యాప్తంగా సిరిసిల్లకు గుర్తింపు తీసుకొచ్చిందన్నారు. సిరిసిల్లలో ఇంత అద్భుతమైన కళాకారులు ఉన్నారా అని ప్రపంచం ఆశ్చర్యపడేలా పరంధాములు చేనేత కళను చాటారని పేర్కొన్నారు. నల్లా పరంధాములు వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆయన కుమారుడు నల్లా విజయ్ అనేక వినూత్న ప్రయోగాలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. చేనేత కళాకారుల నైపుణ్యానికి ఆధునిక సాంకేతికతను జోడించి మెరుగైన ఉత్పత్తులను అందించాలనే తపనతో విజయ్ ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు చేస్తున్నారని ప్రశంసించారు. ప్రస్తుతం 'షిఫ్ట్ జాకార్డ్' పేరుతో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని వెండి, బంగారంతో ప్రత్యేకమైన చీరలను రూపొందిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. 'వెండి వెన్నెల' పేరుతో రూపొందించిన చీర అద్భుతంగా ఉందని, విజయ్ నైపుణ్యం, సృజనాత్మకతను అభినందించేందుకు, ఆయన చేసిన ప్రయోగాన్ని ప్రత్యక్షంగా చూడాలనే ఉద్దేశంతో ఆహ్వానం మేరకు ఇక్కడకు వచ్చానని చెప్పారు. విజయ్‌కు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నానని కేటీఆర్ అన్నారు. గతంలోనూ విజయ్‌ను ప్రోత్సహించానని, భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విజయ్ కోసం సిరిసిల్లలో ఒక అద్భుతమైన కర్మాగారం ఏర్పాటు చేసి, అవసరమైన అన్ని రకాల సబ్సిడీలు అందించడంతో పాటు ఈ పరిశ్రమను మరింత మంది నేతన్నలు అందిపుచ్చుకునేలా ప్రోత్సహిస్తానని కేటీఆర్ తెలిపారు. విజయ్‌తో పాటు సిరిసిల్ల చేనేత కళను కాపాడి, మరింత అభివృద్ధి చేసే ప్రయత్నాన్ని కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. సిరిసిల్లను కేవలం పవర్‌లూమ్ పరిశ్రమకే పరిమితం చేయకుండా, ఆధునిక సాంకేతికతతో కూడిన హ్యాండ్‌లూమ్ చేనేతకు కూడా కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో విజయ్ చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని కేటీఆర్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో మగ్గంపై పని వేగం పెరగడంతో పాటు నేతన్నల శ్రమ తగ్గుతుందని విజయ్ తెలిపారు. ముఖ్యంగా మహిళా కార్మికులకు పని సులభతరం అవుతుందని, తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్పత్తి సాధ్యమవుతుందని చెప్పారు. కొత్త సాంకేతికతతో రూపొందిస్తున్న ప్రత్యేకమైన చీరలకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని, తద్వారా నేతన్నలకు అదనపు ఆదాయం సమకూరుతోందన్నారు.

చేనేత రంగాన్ని ప్రోత్సహించడంలో కేటీఆర్ ఎప్పుడూ ముందుంటారని విజయ్ తెలిపారు. గతంలో తాము రూపొందించిన వినూత్న చీరలను కూడా కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించామని, ఈసారి ఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన హ్యాండ్‌లూమ్ మగ్గాన్ని, దానిపై రూపొందించిన 'వెండి వెన్నెల' చీరను కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



# భవిష్యత్తు డేటా, ఏఐ రంగాలదే

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 :**

ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోందని, ముఖ్యంగా డేటా, డేటా సెంటర్లు, సర్వర్లు, కృత్రిమ మేధస్సు(ఏఐ), కంటెంట్ రంగాల్లో అపారమైన అవకాశాలు ఏర్పడుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు(కేటీఆర్) అన్నారు. కాన్స్టర్ సొల్యూషన్స్ కంపెనీ నూతన కార్యాలయాన్ని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం సంస్థ సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు కంపెనీ కార్యకలాపాలు, వ్యాపార విస్తరణ ప్రణాళికలు, భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులనుద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వం, పరిశ్రమ రెండు రంగాల కోణాల నుంచి రెండు దశాబ్దాలుగా టెక్నాలజీ ప్రపంచాన్ని అత్యంత దగ్గరగా చూసిన అనుభవం ఉందని, ప్రస్తుతం ఈ రంగాల్లో పనిచేస్తున్న వారికి అద్భుతమైన భవిష్యత్ ఉందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ టైమ్ జోన్లలో పనిచేస్తూ అనేక దేశాల ఖాతాదారులతో కలిసి పనిచేయడం ఎంతటి సవాలో తనకు తెలుసన్నారు. కాన్స్టర్ పేరుపై సరదాగా స్పందించిన ఆయన సంస్థ పేరు వెనుక ఉన్న 'కన్వర్జెన్స్ ఆఫ్ స్టోరేజ' భావన తనకు ఆసక్తికరంగా అనిపించిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కంటెంట్ వినియోగం, ఉత్పత్తి విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో దాని నిల్వ చేయడం, నిర్వహించడం, ప్రపంచానికి చేరవేయడంలో కాన్స్టర్ వంటి సంస్థలకు కీలక పాత్ర ఉంటుందన్నారు. గతంలో వార్తాపత్రికలను పేజీపేజీగా చదివే రోజులు ఉండేవని, ఇప్పుడు యువతరం మొబైల్ ఫోన్‌లో ఒక్కోసారి స్వైప్ చేస్తూ ప్రపంచాన్ని చూస్తోందని తెలిపారు. ప్రతి స్వైప్ వెనుక భారీ స్థాయిలో కంటెంట్ ఉత్పత్తి, నిల్వ, పంపిణీ జరుగుతోందని, ఈ డిజిటల్ విప్లవంతో డేటా, స్టోరేజ్ రంగాల ప్రాధాన్యత మరింత పెరుగుతోందని చెప్పారు. కాన్స్టర్ సొల్యూషన్స్ టైర్ 2, టైర్ 3 నగరాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని కేటీఆర్ చెప్పారు. చిన్న పట్టణాలు, నగరాల నుంచి వచ్చే యువతలో అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఆకలి, పట్టుదల ఎక్కువగా ఉంటుందని అన్నారు. ప్రతిభావంతులైన యువతను ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు తీసుకురావడం కంటే కంపెనీలు వారివద్దకే వెళ్లి అవకాశాలు కల్పించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టైర్ 2 నగరాలకు ఐటీ రంగాన్ని విస్తరించాలనే లక్ష్యంతో అనేక ఐటీ హబ్‌లను నిర్మించామని కేటీఆర్ గుర్తు చేశారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన యువతకు వారి స్వస్థలాల్లోనే ఉద్యోగావకాశాలు అందించడమే తమ లక్ష్యమన్నారు. కోవిడ్ మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా పని చేసే విధానాన్నే పూర్తిగా మార్చేసిందన్నారు. ఒకప్పుడు కార్యాలయానికి వచ్చి ఒకేచోట కలిసి పనిచేస్తేనే పనులు జరుగుతాయని భావించేవాళ్లమని, కానీ కోవిడ్ తర్వాత ప్రపంచంలో ఎక్కడినుంచైనా పనిచేసి సమర్థవంతంగా ఫలితాలు సాధించవచ్చని నిరూపితమైందని అన్నారు. టైర్ 2, టైర్ 3 నగరాలు, చిన్న పట్టణాలు, గ్రామాల్లో ఉన్న సరైన ప్రతిభను గుర్తించి అవకాశాలు కల్పిస్తే సంస్థలు అద్భుతంగా ఎదగగలవన్నారు. కాన్స్టర్ సొల్యూషన్స్ తన ఉద్యోగుల సంఖ్యను మరింత విస్తరించే లక్ష్యంతో ముందుకు సాగుతుండటం అభినందనీయమన్నారు. ఊహాశక్తి, ఆశయం, అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యమే ఒక సంస్థ ఎదుగుదలను నిర్ణయిస్తుందని చెప్పారు. కాన్స్టర్ వ్యవస్థాపకులు, నాయకత్వ బృందం, ఉద్యోగులకు కేటీఆర్ అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో సంస్థ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



# వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పక్కా ప్రణాళిక

**మొదటిపేజీ తరువాయి**

లో అక్టోబర్ 1 నాటికే రాష్ట్రవ్యాప్తంగా 8,283 కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో శనివారంనిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్రేడ్ఏ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 మద్దతు ధరగా నిర్ణయించింది. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ఏడు ప్రాధాన్య సన్న రకాలకు (బీపీటీ5204, ఆర్ఎన్ఆర్15048, కేఎన్ఎమ్1638, జై శ్రీరామ్, హెచ్ఎంటీసోనా, డబ్ల్యూజీఎల్44, కేఎన్ఎమ్7715) క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించనున్నది.

**దిగుబడి అంచనాలు**

ఈ వానాకాలంలో 57.70 లక్షల ఎకరాల్లో వరి సాగైందని, 119.57 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో పౌర సరఫరాల సంస్థ ద్వారా 45 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 20 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం కొనుగోలు చేయనున్నారు. తెలంగాణ బియ్యానికి దేశీయంగానే కాక అంతర్జాతీయ స్థాయిలో స్థిరమైన ఎగుమతి మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు దీర్ఘకాలిక వ్యూహాన్ని రూపొందించాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచించారు.

**రవాణా, నిల్వ ఏర్పాట్లు**

ఈ సీజన్‌కు అవసరమైన 16.25 కోట్ల గన్నీ సంచులను వేగవంతంగా సేకరించాలని, ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ తప్పనిసరి చేయాలని ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం రాకుండా సరిహద్దు చెక్ పోస్టులను మరింత బలోపేతం చేయాలన్నారు.

**సకాలంలో చెల్లింపులు**

తూకం, నాణ్యత పరీక్షల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతులకు నగదు చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సంచాలకుడు శ్యామ్ ప్రసాద్, అదనపు సంచాలకుడు రోహిత్ సింగ్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి?

**మొదటిపేజీ తరువాయి**

రోజుల దగా పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన యువ సమరభేరిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను నిండాముంచిన లఫంగా పార్టీ కాంగ్రెస్ అని తీవ్ర పదజాలంతో విమర్శించారు. ఆ రోజు కూడా ఇదే కరీంనగర్‌లో, 2006లో ఇదే కాంగ్రెస్ వాళ్లు కేసీఆర్ రాజీనామా చేయాలని మాట్లాడారు. ఇదే కరీంనగర్ గడ్డ మీద కేసీఆర్ రాజీనామా చేస్తే ఏమైందో గుర్తుందా? 2006లో కాంగ్రెస్ వీపు పగిలింది. ఎవడు కొడితే దిమ్మ తిరిగి మైండ్ బ్లాంక్ అవుతుందో.. అగో ఆయననే కేసీఆర్.. ఆయనతో పెట్టుకోవద్దు. ఇప్పుడు కేసీఆర్‌తో పెట్టుకుంటే రేవంత్ రెడ్డి మళ్లీ అదే అవుతది.. యాదిలో పెట్టుకో! చేసిన మోసాలకు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు 420 హామీలకు 420 సార్లు రాజీనామాలు చేయాలి. ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదు.. మీ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయి. గుర్తుపెట్టుకోండి.. నేను కాంగ్రెస్ పార్టీని హెచ్చరిస్తున్నా. పోరాటాలకు పురిటిగడ్డ కరీంనగర్. కరీంనగర్ నుంచే కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మొదలుపెట్టారు. యువతతో పెట్టుకుంటే పెద్దపెద్ద వాళ్లే దిగిపోయారు. ఉడుకు నెత్తురు ఉరకలెత్తితే పోరాటం పోటెత్తుతుంది. యువత పిడికిలి బిగిస్తే పిడుగుల వర్షం కురుస్తుంది. మాకు స్కిల్ లేదని ఎవరు చెప్పారు? సీఎంకు స్కిల్ ఉందా అని విద్యార్థులు అడుగుతున్నారన్నారు. సీఎం రేవంత్‌కు దరఖాస్తు కూడా రాయడం రాదు. అక్షర దోషం లేకుండా ఏ భాషలోనూ రాయలేడు రేవంత్. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గల్లా పట్టి నిలదీస్తాం. కష్టపడి సాధించుకున్న రాష్ట్రాన్ని పదేళ్లు అభివృద్ధిలో నడిపించాం. అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో అనుకోని ఘోరం జరిగింది. తెలంగాణ ఇవ్వకుండా వేలాది ప్రాణాలు బలిగొన్న ముసలి నక్క కాంగ్రెస్. ముసలి నక్క కాంగ్రెస్ జిత్తులతో అధికారంలోకి వచ్చింది. నిరుద్యోగుల మీద దొంగ ప్రేమ కురిపించారు. దేశం వదిలించుకున్న కాంగ్రెస్ పార్టీ పొరపాటు వల్ల మన నెత్తిన కూర్చుంది. కాంగ్రెస్‌కు జాక్‌పాట్.. తెలంగాణకు గ్రహపాటు అయ్యింది. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలన్నారు.. వచ్చాయా? యూత్ కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు.. చేశారా? ప్రైవేట్ కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ చట్టం తెస్తామన్నారు.. తెచ్చారా? కాలేజీ అమ్మాయిలకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10 లక్షల రుణాలు ఇస్తామన్నారు.. ఇచ్చారా? ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందా? రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు.. ఇచ్చారా? అప్పుడు యూత్ డిక్లరేషన్.. ఇప్పుడు రేవంత్ బూతు డిక్లరేషన్. హామీలు అమలు చేయలేదని ప్రశ్నిస్తే బూతులు మాట్లాడుతున్నాడు. మోసం చేసిన కాంగ్రెస్ నేతలను యువత చీరేసి చింతకు కట్టాలి. పందికొక్కుల్లాగా తినడం తప్ప కాంగ్రెస్ నేతలు చేసిందేమీ లేదు. తిన్నది అరగక కేసీఆర్ రాజీనామా చేయాలంటున్నారు. 1000 రోజులైనా హామీలు అమలు చేయలేని రేవంత్ రాజీనామా చేయాలి. నిరుద్యోగులను నిండా ముంచి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారు. ఉద్యోగాలు ఏమయ్యాయని అడిగితే బూతులు మాట్లాడుతున్నాడు. సీఎం, మంత్రులు వాటాల కోసం తన్నుకుంటున్నారు. గాలి మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చారు. దండం పెట్టి ఓట్లేసిన ఉద్యోగులే మీకు పిండం పెడతారు. కాంగ్రెస్ కొన్ని తరాల పాటు కనిపించకుండా పోయే తీర్పు యువత చెప్పాలి. సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అశోక్‌నగర్‌లో రాహుల్ అన్నారు. ఓట్లు వేయించుకొని అడ్రస్ లేకుండా పోయారు రాహుల్ గాంధీ. రేవంత్ దగ్గర నెలకోసారి పైసలు తీసుకొని సీఎం సీటును రెన్యువల్ చేస్తున్నారు. రాహుల్ మూటలు తీసుకుంటూ అన్నీ మూసుకొని ఢిల్లీలో కూర్చున్నాడు.

# 22ఏలో చేర్చడం మానవ హక్కుల ఉల్లంఘనే

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 :**

భూభారతి 22ఏ ద్వారా రైతుల భూములను అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో బీజేపీ ఆధ్వర్యంలో భూభారతి, 22ఏపై శనివారం మహాధర్నా నిర్వహించారు. శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ మహా ధర్నాలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భూభారతి, 22ఏ నిషేధిత జాబితా పేరుతో మధ్యతరగతి కుటుంబాలను, రైతులను ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. గత బీఆరఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో ఒక బ్లాక్‌లిస్టెడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీకి వ్యవస్థను అప్పగించి అవకతవకలకు పాల్పడితే ఆ లోపాలను సరిదిద్దేందుకు భూభారతి తెస్తామన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మరింత ఘోరంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో 15 శాతం కమీషన్లతో నిషేధిత జాబితాలోని భూములను తొలగిస్తే ప్రస్తుత ప్రభుత్వంలో 30 శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తప్పు జరిగిందని ముఖ్యమంత్రి, మంత్రులే స్వయంగా ఒప్పుకుంటున్నప్పుడు అందుకు బాధ్యులైన ప్రభుత్వానికి శిక్ష పడాల్సిందేనని అన్నారు. రైతులే కాక మల్కాజిగిరి వంటి ప్రాంతాల్లో చిన్నచిన్న ప్లాట్లు కొనుక్కుని నిర్మించుకున్న మధ్యతరగతి ప్రజల ఇళ్లను, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లోని నిర్మాణాలను కూడా 22ఏ జాబితాలో చేర్చడం శోచనీయ మని అన్నారు. ప్రభుత్వ భూములు, వక్ఫ్ బోర్డు భూముల పేరు చెప్పి ప్రైవేట్ పట్టా భూములను నిషేధిత జాబితాలో పెట్టడం వెనుక ప్రభుత్వ దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. ఏదైనా సర్వే నంబర్‌లో కొంత భాగంపై వివాదం ఉంటే ఏకంగా మిగతా సర్వే నంబర్ మొత్తాన్ని నిషేధిత జాబితాలో చేర్చి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల కడుపు కొట్టేలా సాగుతున్న ఈ అక్రమాలపై వెంటనే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని, రైతులు సమస్యలు చెప్పుకోవడానికి వెళ్తే కలెక్టర్లు సమయం కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 లక్షల మంది తమ భూములను అమ్ముకోలేక, పిల్లల ఉన్నత చదువులు లేదా పెళ్లిళ్ల కోసం రుణాలు తీసుకోలేక తీవ్ర క్షోభకు గురవుతున్నారన్నారు. సొంత భూమిపై హక్కు అనేది రాజ్యాంగబద్ధమైన మానవ హక్కు అని, రాష్ట్ర ప్రభుత్వం ఆ హక్కులను తుంగలో తొక్కుతోందని మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడితే, కాంగ్రెస్ పాలనలో రేవంత్ రెడ్డి అండ్ బ్రదర్స్ మాత్రమే బాగుపడుతున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల ప్రశ్నలను ఎదుర్కొనే ధైర్యం లేకనే సభను రెండు రోజులకే పరిమితం చేస్తున్నారని, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ధర్నాలకు కూడా అనుమతులు ఇవ్వడానికి భయపడుతోందని అన్నారు. 22ఏలోని రైతుల, ప్రజల భూములన్నింటినీ తక్షణమే విముక్తి చేయాలని, లేనిపక్షంలో సడక్ నుంచి సదన్ వరకు బీజేపీ రాజీ లేని పోరాటం చేస్తుందని రామచందర్ రావు హెచ్చరించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, శాసనమండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, డి.కె.అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోడం నగేష్, ఎమ్మెల్యేలు కె.వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, రామారావు పటేల్, ఎమ్మెల్సీ కొమురయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అశోక్, డాక్టర్ గౌతమ్ రావు, వీరేందర్ గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పాల్గొన్నారు.

**'ఆర్ఆర్ రియల్ ఎస్టేట్'గా మార్చారు: కిషన్ రెడ్డి ఆగ్రహం**

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి ప్రజల భూములను అక్రమంగా నిషేధిత 22ఏ జాబితాలో చేర్చి 'రేవంత్ రెడ్డి – రాహుల్ గాంధీ ప్రైవేట్ లిమిటెడ్ రియల్ ఎస్టేట్ కంపెనీగా మార్చేసిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అన్ని అనుమతులు ఉండి పన్నులు చెల్లిస్తున్న పేదల నివాసాలను, భూములను రాత్రికి రాత్రే 22ఏ జాబితాలోకి నెట్టడం దుర్మార్గమని, వీటిని బేషరతుగా తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ, మౌలానా ఆజాద్ ఉర్దూ వర్సిటీ, హౌసింగ్ బోర్డు, దేవాదాయ శాఖ భూములతోపాటు పార్కులు, కమ్యూనిటీ స్థలాలను వేలం పేరుతో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. భూములు అమ్మితే తప్ప ప్రభుత్వం నడవని దుస్థితికి తీసుకొచ్చారని విమర్శించారు. 22ఏ భూములు, ప్రైవేట్ సెటిల్మెంట్ల ద్వారా వసూలు చేసిన వేలాది కోట్ల ప్రజాధనాన్ని కాంగ్రెస్ అధిష్టానానికి, ఇతర రాష్ట్రాల ఎన్నికల ఖర్చులకు తరలిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం నిధులను పక్కదారి పట్టించడం వల్లే ఉద్యోగులకు నెలనెలా జీతాలు ఇవ్వలేకపోతున్నదని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక ఖమ్మంలో రిటైర్డ్ పోలీసులు ఆత్మహత్యలు చేసుకునే స్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలక పార్టీకి కొమ్ముకాస్తూ పేదల భూములను 22ఏ జాబితాలోకి నెట్టిన అధికారుల, నేతల అక్రమాల సమాచారం తమ వద్ద భద్రంగా ఉందన్నారు. 2029లో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రతి పైసా లెక్క తేల్చి పేదలకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. 22ఏ అక్రమాలపై కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం తేవాలని పిలుపునిచ్చారు.

**రెవెన్యూ మంత్రి రాజీనామా చేయాలి : డాక్టర్ లక్ష్మణ్**

కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వంలా కాక రియల్ ఎస్టేట్ సంస్థలా వ్యవహరిస్తోందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ మండిపడ్డారు. భూములన్నింటినీ అమ్మకాలకు పెట్టి రాబోవు తరాల భవితవ్యాన్ని నాశనం చేయడంతోపాటు ఖాళీ భూములు, ఎండోమెంట్, అసైన్‌మెంట్ భూములపై కూడా కన్నేశారని ధ్వజమెత్తారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజ కవర్గం పరిధిలోని కొర్రెంల గ్రామ దళితులు అధికారుల వద్దకు వెళ్తే స్థానిక కాంగ్రెస్ నాయకులు, దళారులు రంగప్రవేశం చేసి ఐదెకరాలు ఉంటే మూడెకరాలు వదులుకోవాలంటూ బెదిరింపులకు, సెటిల్మెంట్లకు దిగుతున్నారని ఆరోపించారు. బీఆరఎస్ ప్రభుత్వం ఎన్టీఆర్ మైదానంలో భారీ మాల్, ఫుడ్‌కోర్టులు నిర్మించాలని చూస్తే నాడు ఎమ్మెల్యేగా తాను అడ్డుకున్నానని, అందువల్లే నేడు అది ప్రజలకు మిగిలిందని గుర్తు చేశారు. ముషీరాబాద్, ఆజామాబాద్ ఏరియాలోని పరిశ్రమల భూములను, వీఎస్టీ, అగర్వాల్ ఇండస్ట్రీస్, హెచ్‌సీయూ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్రలపై రాజ్యసభలో గళమెత్తి అడ్డుకున్నామన్నారు. లక్షలాది కుటుంబాల ఆవేదనకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి రాజీనామా చేయాలని, 22ఏలో చేర్చిన భూములను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎండోమెంట్, అసైన్డ్ భూములను చట్టబద్ధమైన హక్కుదారులకే దక్కేలా పూర్తి న్యాయం చేస్తుందని భరోసా ఇచ్చారు.

# రోడ్లపై వంటావార్పుతో తెలంగాణ వచ్చింది

**మొదటిపేజీ తరువాయి**

దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'రైతు పొలికేక' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మేము గొంతెమ్మ కోరికలు కోరడం లేదు, ఎన్నికల్లో మీరు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కేసీఆర్ లాగా రైతులకు అండగా ఉండాలని మాత్రమే డిమాండ్ చేస్తున్నామన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో కరెంట్ అంటే ఒక లెక్క లేకుండా 24 గంటలు బాయి కాడ కరెంట్ ఉండేది. ఇప్పుడు పొద్దున లేస్తే కరెంట్ కోసం ఫోన్లు వస్తున్నాయి. ఎనిమిది గంటలు కూడా సరిగ్గా కరెంట్ రాక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరమ్మ పాలన, పాత రోజులు తెస్తానన్న రేవంత్ రెడ్డి.. నిజంగానే కరెంట్ కష్టాలతో పాత రోజులను వెనక్కి తెచ్చాడు. లాక్ డౌన్ లో ఇళ్లలో ఉన్నప్పుడు కూడా కేసీఆర్ రైతుబంధు ఆగనివ్వలేదు. ఎమ్మెల్యేల జీతాలు, ఉద్యోగుల జీతాలు సగం ఆపినా, కాంట్రాక్టర్ల బిల్లులు ఆపినా రైతులకు మాత్రం పక్కాగా రైతుబంధు అందించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. ఓట్ల కోసం కేసీఆర్ ఏనాడు రైతుబంధు ఇస్తానని మాట ఇవ్వలేదు. కానీ రైతుల కష్టం చూసి రైతుబంధు ప్రారంభించారు. రేవంత్ రెడ్డి మాత్రం కేసీఆర్ రూ.10 వేలు ఇస్తే నేను రూ.15 వేలు ఇస్తానని చెప్పి, ఉన్నదాన్నే ఎగ్గొట్టాడు. ఈ మూడేళ్లలో రేవంత్ రెడ్డి రైతులకు ఎగ్గొట్టిన రైతుబంధు అక్షరాలా రూ. 29 వేల కోట్లు. పాముకాటుకో, కరెంట్ షాక్ తోనో రైతు చనిపోతే ఏ కష్టం లేకుండా రూ. 5 లక్షలు ఇచ్చే రైతు బీమా ఇప్పుడు ఏమైంది. ఈ నెల 13న ప్రీమియం కట్టకుండా రేవంత్ రెడ్డి రైతుల బీమాను బంద్ చేశాడు. దుకాణానికి వెళ్లి నాలుగు సంచుల యూరియా తెచ్చుకునే రోజులు పోయాయి. ఇప్పుడు యాప్ లలో బుక్ చేస్తే 15 రోజులకు గానీ డీఏపీ, యూరియా దొరకని దౌర్భాగ్య పరిస్థితి దాపురించింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డీఏపీ ధరలను రూ. 900 నుంచి రూ. 2200కి పెంచితే, రాష్ట్ర ప్రభుత్వం యాప్ లతో రైతుల ఉసురు తీసుకుంటోంది. వడ్ల కొనుగోలులో రైతులను మోసం చేస్తూ బస్తాకు 5 కిలోల తరుగు పెడుతున్న మిల్లర్ల చేతిలో ముఖ్యమంత్రి కీలుబొమ్మగా మారాడు. అసెంబ్లీలో తరుగు తీస్తే తోలు తీస్తానన్న ముఖ్యమంత్రి.. నేడు మిల్లర్లకే వత్తాసు పలుకుతున్నాడు. ఏ పంట పండినా కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్ ది. కానీ రేవంత్ రెడ్డి మాత్రం కేంద్రం ఏది కొనమంటే అదే కొంటానని చేతులెత్తేస్తున్నాడు. కేంద్రం కొనకపోతే రాష్ట్ర ముఖ్యమంత్రిగా నీ బాధ్యత ఏంటి? చేతకాకపోతే కుర్చీ దిగిపో. రైతులను ఆదుకున్న కేసీఆర్ రైతు బాంధవుడైతే, ఈ వెయ్యి రోజుల పాలనలో రైతుల ఉసురు పోసుకుంటున్న రేవంత్ రెడ్డి ఒక రాబందు లాంటివాడని విమర్శించారు. మండుటెండల్లో మల్లన్న సాగర్ గేట్లు ఎత్తి కూడెల్లి వాగులో నీళ్లు పారించి రైతుల పొలాలను పచ్చగా ఉంచిన భగీరథుడు కేసీఆర్. కానీ రేవంత్ రెడ్డి వచ్చిన మూడేళ్లలో మెదక్, దుబ్బాక, సిద్దిపేటలో ఒక్క ఎకరా కాలువ తవ్వలేదు. మేడిగడ్డ దగ్గర చిన్న పిల్లర్ మరమ్మతు చేయకుండా, మోటార్లు ఆన్ చేయకుండా కావాలనే కాళేశ్వరం ప్రాజెక్టును పడుకోబెట్టాడు. ఇది కేవలం రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు. 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో 1000 అబద్ధాలు, కబ్జాలు, మోసాలు తప్ప మరేమీ లేదు. దేవుళ్ళ మీద ప్రమాణాలు చేసి మాట తప్పిన రేవంత్ రెడ్డి మనిషేనా? నాలుగు వేల పెన్షన్ ఇస్తానని మోసం చేయడమే కాకుండా, ఉన్న 3 లక్షల 50 వేల పెన్షన్లు తొలగించారు. కేసీఆర్ ఇచ్చిన కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు. తులం బంగారం పేరుతో ఆడబిడ్డలను నిలువునా మోసం చేశాడు. కరెంట్, రైతుబంధు, రైతుబీమా ఇవన్నీ మళ్లీ పక్కాగా రావాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలి. కాంగ్రెస్ మోసాలకు రైతులు, మహిళలు తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.



# యూస్‌మార్గ్‌లో లష్కరే కమాండర్ హతం

- భద్రతా బలగాల సంయుక్త ఆపరేషన్
- ఎదురుకాల్పుల్లో యాసిర్ మృతి
- 53 రాష్ట్రీయ రైఫిల్స్, స్పెషల్ ఫోర్సెస్ గాలింపు
- స్థానిక నెట్‌వర్క్‌పై దర్యాప్తు ముమ్మరం
- సులైమాన్ మూసా గ్రూప్‌తో గతంలో సంబంధాలు

**బద్గామ్, సెప్టెంబర్ 5 :**

జమ్మూకశ్మీర్‌లోని బద్గామ్ జిల్లా యూస్‌మార్గ్ ఎగువ ప్రాంతాల్లో భద్రతా బలగాలు చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో లష్కరే తొయిబా కమాండర్ యాసిర్ హతమయ్యాడు. ఉగ్రవాదుల కదలికలపై అందిన కచ్చితమైన నిఘా సమాచారంతో ఆర్మీకి చెందిన 53 రాష్ట్రీయ రైఫిల్స్, స్పెషల్ ఫోర్సెస్ బలగాలు శుక్రవారం రాత్రి గాలింపు చేపట్టాయి. ఈ సందర్భంగా ఎదురుకాల్పులు జరగడంతో యాసిర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

**ఒంటరిగానే కార్యకలాపాలు**

భద్రతా సంస్థల వివరాల ప్రకారం.. యాసిర్ గతంలో లష్కరే తొయిబాకు చెందిన సులైమాన్ మూసా గ్రూప్‌లో కీలక సభ్యుడిగా పనిచేశాడు. ఏడాది క్రితం ఆ ముఠా నుంచి విడిపోయిన తర్వాత సొంతంగా ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. యూస్‌మార్గ్ పరిసరాల్లో అతడి కదలికలపై నిఘా ఉంచిన బలగాలు పక్కా ప్రణాళికతో ఆపరేషన్ నిర్వహించి మట్టుబెట్టాయి.

**నెట్‌వర్క్‌పై ఆరా**

యాసిర్ హతంతో యూస్‌మార్గ్ ప్రాంతంలో లష్కరే తొయిబా నెట్‌వర్క్‌కు గట్టి దెబ్బ తగిలిందని అధికారులు తెలిపారు. అతడితో సంబంధాలు ఉన్న ఇతర ఉగ్రవాదులు, స్థానికంగా సహకరిస్తున్న వ్యక్తులు, ఇటీవల జరిగిన ఉగ్ర ఘటనల్లో అతడి పాత్రపై భద్రతా బలగాలు, దర్యాప్తు సంస్థలు విచారణ కొనసాగిస్తున్నాయి.

**ఎవరీ సులైమాన్ మూసా?**

హాషిమ్ మూసా పేరుతోనూ సులైమాన్ మూసా వ్యవహరించేవాడు. 2025లో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రధాన సూత్రధారుల్లో అతడొకడిగా భద్రతా సంస్థలు గుర్తించాయి. అనంతరం శ్రీనగర్‌లోని దాచిగామ్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిర్వహించిన ప్రత్యేక ఎన్‌కౌంటర్‌లో మూసా హతమైనట్లు అధికారులు వెల్లడించారు.

# మోదీ ‘జెన్-జీ’ మాటలతో సందడి

- ఎస్ఆర్‌సీసీ శతాబ్ది వేడుకల ముగింపు సభలో ప్రధాని ప్రసంగం
- ‘OG’, ‘ఫ్లెక్స్’ అంటూ విద్యార్థుల్లో ఉత్సాహం
- 2013 నాటి ‘సగం నిండిన గ్లాస్’ ప్రసంగం గుర్తుచేసుకున్న మోదీ
- ప్రపంచ స్థాయి సంస్థలుగా భారత కంపెనీలు ఎదగాలని పిలుపు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5:**



ఢిల్లీలోని ప్రముఖ శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది వేడుకల ముగింపు సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. నేటి యువత, ముఖ్యంగా జెన్‌జీకి పరిచయమైన పదాలను ఉపయోగిస్తూ విద్యార్థులతో మమేకమయ్యారు. కళాశాల పూర్వ విద్యార్థుల విజయాలను ప్రస్తావిస్తూ.. జెన్‌జీ భాషలో చెప్పాలంటే ఎస్ఆర్‌సీసీ పూర్వ విద్యార్థులు ‘ఓజీ’ (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్) అంటూ చమత్కరించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ‘నేను ఎస్ఆర్‌సీసీ విద్యార్థిని’ అని చెప్పుకోవడమే ఒక పెద్ద ‘ఫ్లెక్స్’ అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. అరుణ్ జైట్లీ, సంజీవ్ సన్యాల్ వంటి ప్రముఖులతో కలిసి పని చేసిన అనుభవాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

**సగం నిండిన గ్లాస్ సిద్ధాంతం**

2013లో ఎస్ఆర్‌సీసీని సందర్శించిన సందర్భంగా చేసిన ప్రసంగాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. గ్లాసులో సగం నీళ్లు ఉన్నప్పుడు దాన్ని సగం ఖాళీగా చూడటం కంటే సగం నిండినట్లు చూడటమే సానుకూల దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. అదే విధంగా భారత్‌లోని అవకాశాలను సానుకూల దృష్టితో చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోని అగ్రగామి బహుళజాతి సంస్థలకు భారతీయులు నాయకత్వం వహిస్తున్నారని, అలాంటప్పుడు భారత కంపెనీలే ప్రపంచ స్థాయి సంస్థలుగా ఎందుకు ఎదగకూడదని విద్యార్థులను ప్రశ్నించారు.

**ఎన్ఈపీ అమలుపై ప్రశంసలు**

కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎస్ఆర్‌సీసీ జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ను సమర్థవంతంగా అమలు చేస్తోందని ప్రశంసించారు. గత పదేళ్లలో దేశంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య 4.54 కోట్లకు చేరిందని తెలిపారు. భారత్‌లో 2.3 లక్షల గుర్తింపు పొందిన స్టార్టప్‌లు ఉండగా.. దేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా ఎదిగిందని వివరించారు.

# మెట్రోలో మోదీ ప్రయాణం

- ఎస్ఆర్‌సీసీ శతాబ్ది వేడుకలకు మెట్రోలో ప్రధాని
- విద్యార్థులు, ప్రయాణికులతో ముచ్చట
- చిన్నారులతో సరదాగా సంభాషణ
- ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మోదీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5:**

శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ మెట్రోలో ప్రయాణించారు. కాలేజీకి వెళ్లేందుకు మెట్రో ఎక్కిన ఆయన.. ప్రయాణంలో విద్యార్థులు, తోటి ప్రయాణికులు, చిన్నారులతో ముచ్చటించారు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం కావడంతో వారికి శుభాకాంక్షలు తెలిపారు.

**మెట్రోలో సందడి**

ఎస్ఆర్‌సీసీ శతాబ్ది వేడుకలకు హాజరయ్యేందుకు మెట్రోలో ప్రయాణించడం ఆసక్తికరంగా మారింది. సాధారణ ప్రయాణికులతో కలిసి మెట్రోలో ప్రయాణించిన మోదీ.. వారితో మాట్లాడి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతోనూ సరదాగా సంభాషించారు.

**ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా**

దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్న సెప్టెంబర్ 5న ప్రధాని ఎస్ఆర్‌సీసీకి వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాలేజీలో ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా విద్య, యువత, ఉన్నత విద్యారంగంపై ప్రధాని ఏం మాట్లాడతారనేది ఆసక్తికరంగా మారింది.



**గతంలోనూ మెట్రో ప్రయాణం**

మోదీ గతంలోనూ ఢిల్లీ మెట్రోలో ప్రయాణించారు. మూడేళ్ల క్రితం కూడా ఢిల్లీ మెట్రోలో ప్రయాణించిన ఆయన.. ప్రయాణికులతో సరదాగా మాట్లాడారు. ముంబై, బెంగళూరు మెట్రో రైళ్లలోనూ ప్రధాని ప్రయాణించి తోటి ప్రయాణికులతో ముచ్చటించారు.

# రూ.1,322 కోట్ల మోసం కేసులో సుభాష్ చంద్ర

- ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌ను మోసగించినట్లు ఆరోపణలు
- సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు
- రుణాల మళ్లింపుపై దర్యాప్తు
- కంపెనీల డైరెక్టర్లు, ఇతరుల పాత్రపై ఆరా
- డొల్ల కంపెనీల నెట్‌వర్క్‌పై దృష్టి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5:**



ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌ను దాదాపు రూ.1,322 కోట్ల మేర మోసగించినట్లు వచ్చిన ఆరోపణలపై ఎస్సెల్ గ్రూప్ అధినేత సుభాష్ చంద్ర సహా పలువురిపై సీబీఐ కేసు నమోదు చేసింది. రుణాల మంజూరు, నిధుల విడుదలలో నిబంధనలను ఉల్లంఘించి సొమ్మును ఇతర మార్గాల్లోకి మళ్లించినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించిన అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణను వేగవంతం చేశారు.

**రుణాల మంజూరులో అక్రమాలు**

ప్రభుత్వ రంగానికి చెందిన ఆర్థిక సంస్థ నుంచి భారీ మొత్తంలో రుణాలు పొందేందుకు తప్పుడు సమాచారం, అక్రమ పద్ధతులను ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రుణాలు పొందిన అనంతరం వాటిని నిర్దేశిత ప్రయోజనాలకు కాకుండా ఇతర అవసరాలకు మళ్లించినట్లు సీబీఐ అనుమానిస్తోంది. తీసుకున్న మొత్తాలను తిరిగి చెల్లించకపోవడంతో ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌కు భారీ నష్టం వాటిల్లినట్లు కేసులో పేర్కొన్నారు.

**కంపెనీల డైరెక్టర్లపై దృష్టి**

సుభాష్ చంద్రతో పాటు రుణాలు పొందిన సంస్థల డైరెక్టర్లు, ఈ వ్యవహారంలో సహకరించిన ఇతర వ్యక్తుల పాత్రపైనా సీబీఐ ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన, నేరపూరిత కుట్ర, నమ్మకద్రోహం తదితర ఆరోపణలపై ఆధారాలను సేకరించే ప్రక్రియను ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

**డొల్ల కంపెనీల గుట్టుపై ఆరా**

రూ.1,322 కోట్లలో ఎంత మొత్తం ఎక్కడికి బదిలీ అయింది? నిధుల మళ్లింపులో ఎలాంటి సంస్థలు, వ్యక్తులు కీలకంగా వ్యవహరించారు? వాటి వెనుక డొల్ల కంపెనీల నెట్‌వర్క్ ఉందా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. భారీ మొత్తంలో నిధుల వ్యవహారం కావడంతో కార్పొరేట్, బ్యాంకింగ్ రంగాల్లో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది.

# నేపాల్‌లో మరో అద్భుతం

- 10 రోజుల తర్వాత ఇద్దరికి పునర్జన్మ
- బురద, శిథిలాల నుంచి సజీవంగా వెలికితీత
- రెండు రోజుల్లో నలుగురి ప్రాణాలు కాపాడిన రెస్క్యూ బృందాలు
- హైడ్రోపవర్ టన్నెళ్లలో కొనసాగుతున్న గాలింపు
- 1,300 మందికి పైగా మృతి.. 5 వేల మంది గల్లంతు

**ఖాట్మండు, సెప్టెంబర్ 5:**

తీవ్ర ప్రళయంతో అతలాకుతలమైన నేపాల్‌లో శనివారం మరో అద్భుత ఘటన చోటుచేసుకుంది. వరద బురద, కాంక్రీట్ శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులను దాదాపు 10 రోజుల తర్వాత సహాయక బృందాలు సజీవంగా వెలికితీశాయి. దీంతో గత రెండు రోజుల్లో ప్రాణాలతో బయటపడిన వారి సంఖ్య నాలుగుకు చేరింది.

**టన్నెల్‌లో చైనా కార్మికుడి రక్షణ**

త్రిశూలి3ఏ జలవిద్యుత్ ప్రాజెక్టు కింద ఉన్న 225 మీటర్ల పొడవైన సొరంగంలో చిక్కుకున్న చైనా కార్మికుడు లుహైతావోను నేపాల్ ఆర్మీ, దక్షిణ కొరియా విపత్తు నిర్వహణ బృందాలు సంయుక్తంగా రక్షించాయి. బురదతో పూర్తిగా కప్పబడి ఉన్న అతడిని బయటకు తీసిన వెంటనే హెలికాప్టర్‌లో ఆసుపత్రికి తరలించారు. ఇదే సొరంగం నుంచి శుక్రవారం ఇద్దరు నేపాల్ కార్మికులను కూడా సురక్షితంగా బయటకు తీసిన విషయం తెలిసిందే.

**శిథిలాల మధ్య వృద్ధురాలు**

నూవాకోట్ పట్టణంలో కూలిపోయిన ఓ ఇంటి శిథిలాల మధ్య చిక్కుకున్న 64 ఏళ్ల చండిక శ్రేష్ఠను కూడా సహాయక బృందాలు సురక్షితంగా బయటకు తీశాయి. అనంతరం ఆమెను మెరుగైన వైద్యం కోసం ఖాట్మండుకు తరలించారు.

**దేశవ్యాప్తంగా గాలింపు**

నేపాల్‌లోని 12 జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో దాదాపు 900 మంది కార్మికులు గల్లంతైనట్లు అధికారులు గుర్తించారు. వివిధ సొరంగాల్లోనే సుమారు 500 మంది చిక్కుకుపోయి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఆగస్టు 26న హిమనదం పేలుడు కారణంగా సంభవించిన ఈ విపత్తులో ఇప్పటివరకు 1,300 మందికి పైగా మృతి చెందగా, 5 వేల మందికిపైగా గల్లంతైనట్లు విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. టన్నెళ్లలో చిక్కుకున్న వారిని గుర్తించి రక్షించేందుకు భారత్, చైనా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియాకు చెందిన నిపుణులు నేపాల్ బలగాలతో కలిసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

**గుర్తుతెలియని మృతదేహాలకు సామూహిక దహనం**

గుర్తుపట్టలేని స్థితిలో లభ్యమైన 1,030 మృతదేహాలకు డీఎన్ఏ నమూనాలు సేకరించిన అనంతరం నేపాల్ పోలీసులు సామూహిక దహన సంస్కారాలు నిర్వహించారు. విపత్తు కారణంగా ఇళ్లు కోల్పోయిన వేలాది మంది ప్రస్తుతం పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. బాధితుల కోసం త్వరలో సురక్షితమైన శాశ్వత నివాసాలను నిర్మించి ఇస్తామని నేపాల్ ప్రధాని బాలేంద్ర షా హామీ ఇచ్చారు.



# వీర్ గార్డియన్-2026కు జపాన్ బలగాలు

- జోధ్‌పూర్‌లో సెప్టెంబర్ 9 నుంచి వైమానిక విన్యాసాలు
- రెండు సీ-2 రవాణా విమానాలతో భారత్‌కు చేరుకున్న జపాన్ బృందం
- రెండు వారాల పాటు కొనసాగనున్న సంయుక్త విన్యాసాలు
- యుద్ధ వ్యూహాలు, సాంకేతికతపై పరస్పర అవగాహన
- ఇండో-పసిఫిక్ భద్రతకు కీలకంగా మారనున్న సాధన

**జోధ్‌పూర్, సెప్టెంబర్ 5:**

భారత్, జపాన్ వైమానిక దళాల మధ్య ద్వైపాక్షిక వాయుసేన విన్యాసాలు ‘వీర్ గార్డియన్2026’కు రంగం సిద్ధమైంది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ వైమానిక స్థావరంలో సెప్టెంబర్ 9 నుంచి 22 వరకు ఈ విన్యాసాలు జరగనున్నాయి. రెండో విడత విన్యాసాల్లో పాల్గొనేందుకు జపాన్ వాయుసేన బృందం శనివారం భారత్‌కు చేరుకుంది. జపాన్ రక్షణ దళానికి చెందిన రెండు సీ2 సైనిక రవాణా విమానాలు జోధ్‌పూర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దిగగా.. భారత వైమానిక దళ అధికారులు జపాన్ బృందానికి స్వాగతం పలికారు.

**కార్యాచరణ సమన్వయంపై దృష్టి**

విన్యాసాల ద్వారా ఇరు దేశాల వాయుసేనల మధ్య కార్యాచరణ సమన్వయం, పరస్పర అవగాహన మరింత మెరుగుపడుతుందని ఐఏఎఫ్ తెలిపింది. క్లిష్టమైన పరిస్థితుల్లో సంయుక్తంగా కార్యకలాపాలు నిర్వహించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడమే ప్రధాన లక్ష్యంగా పేర్కొంది.

**వ్యూహాలు, సాంకేతికతలపై సాధన**

రెండు దేశాల పైలట్లు అత్యాధునిక వైమానిక సాంకేతిక పరిజ్ఞానం, వ్యూహాలను పరస్పరం పంచుకోనున్నారు. వివిధ పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేసే విధానాలపై సంయుక్తంగా శిక్షణ పొందనున్నారు. ఈ సాధన ద్వారా ఇరు వాయుసేనల మధ్య పరస్పర కార్యాచరణ సామర్థ్యం మరింత బలోపేతం కానుంది.

**రక్షణ భాగస్వామ్యానికి ఊతం**

ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రతలను బలోపేతం చేయడంలో ఈ విన్యాసాలు కీలకంగా నిలవనున్నాయి.

# జిరామ్ వ్యాలీ కేసులో 10 మంది దోషులు

- మావోయిస్టుల దాడి కేసులో ఎన్ఐఏ కోర్టు కీలక తీర్పు
- ఇద్దరు మహిళలు సహా నిందితులంతా దోషులుగా నిర్ధారణ
- శిక్షపై తీర్పు సెప్టెంబర్ 16కు రిజర్వ్
- దాడిలో కాంగ్రెస్ అగ్రనేతలు సహా 29 మంది మృతి

**జగదల్‌పూర్, సెప్టెంబర్ 5 :**

ఛత్తీస్‌గఢ్‌లో 2013లో సంచలనం సృష్టించిన జిరామ్ వ్యాలీ మావోయిస్టుల దాడి కేసులో జగదల్‌పూర్ ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు శనివారం కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఇద్దరు మహిళలు సహా మొత్తం 10 మంది నిందితులను దోషులుగా తేల్చింది. దోషులకు విధించే శిక్షలపై తీర్పును సెప్టెంబర్ 16కు రిజర్వ్ చేసింది. కేసు విచారణలో భాగంగా ప్రత్యేక న్యాయస్థానం మొత్తం 101 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసింది. ట్రయల్ కోర్టు తీర్పు కాపీ అందిన తర్వాత పైకోర్టును ఆశ్రయిస్తామని డిఫెన్స్ న్యాయవాది అరవింద్ చౌదరి తెలిపారు.

కాంగ్రెస్ ర్యాలీపై దాడి

2013 మే 25న బస్తర్ జిల్లా దర్భా పోలీస్ స్టేషన్ పరిధిలోని జిరామ్ లోయ జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ‘పరివర్తన్ ర్యాలీ’ని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు దాడికి పాల్పడ్డారు. దేశంలోనే అత్యంత తీవ్రమైన మావోయిస్టు దాడుల్లో ఒకటిగా నిలిచిన ఈ ఘటనలో కాంగ్రెస్ అగ్రనేతలు, భద్రతా సిబ్బంది, పౌరులు సహా 29 మంది ప్రాణాలు కోల్పోయారు. 30 మందికి పైగా గాయపడ్డారు.

**అగ్రనేతల మృతి**




ఈ దాడిలో అప్పటి ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్ పటేల్, అసెంబ్లీ మాజీ ప్రతిపక్ష నేత మహేంద్ర కర్మా, కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా, సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముద్లియార్ తదితరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకత్వం తీవ్రంగా నష్టపోయింది.

**శిక్షపై 16న తీర్పు**

కేసులో నిందితులపై నమోదైన అభియోగాలు, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు 10 మందిని దోషులుగా నిర్ధారించింది. శిక్షలపై ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం సెప్టెంబర్ 16న తీర్పు వెలువరించనుంది. మరోవైపు ట్రయల్ కోర్టు తీర్పు కాపీ అందిన తర్వాత పైకోర్టులో అప్పీల్ చేస్తామని నిందితుల తరఫు న్యాయవాది తెలిపారు.

# గురువులే భావితరాల రూపశిల్పులు

- మా ఉన్నతికి ఉపాధ్యాయులే కారణం
- ధైర్యంగా, నిబద్ధతతో పని చేయండి
- కరీంనగర్‌ను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుదాం
- కలెక్టర్ చిత్రా మిశ్రా



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

గురువులే భావితరాల రూపశిల్పులని, అజ్ఞానాన్ని తొలగించి విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ చిత్రా మిశ్రా, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఈవో చైతన్య జైనీ, విద్యాశాఖ ఏడి ప్రశాంత్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల రెండో ఇల్లులాంటిదని, బాల్యం నుంచే పాఠ్యాంశాలతో పాటు శుభ్రత, ధైర్యం, క్రమశిక్షణ వంటి విలువలను నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తాము ఈ స్థాయిలో ఉన్నామంటే తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులే కారణమని, తన ఉన్నతికి కారణమైన గురువులను నిత్యం గుర్తు చేసుకుంటానని తెలిపారు. అన్ని వృత్తుల వారిని తయారు చేసేది ఉపాధ్యాయ వృత్తేనని, ప్రతి నిమిషం బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల ప్రగతిపై మండలాల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మరిన్ని సీఎస్ఆర్ నిధులు సమీకరించి పాఠశాలలను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. భయంతో కాకుండా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, వారి సహకారాన్ని అభినందించారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ సామాన్యులను అసామాన్యులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. వ్యక్తి ఉన్నత స్థానానికి చేరుకోవడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా పాఠాలు బోధించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని పాఠశాలలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. సైన్స్ మ్యూజియాన్ని ఆధునీకరించామని, త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. డీఈవో చైతన్య జైనీ మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతి కోసం అనేక కార్యక్రమాలు రూపొందిస్తున్నామని తెలిపారు. వాటిలో భాగస్వాములవుతున్న ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. కలెక్టర్ మార్గదర్శకత్వం విద్యాశాఖకు మరింత స్ఫూర్తినిస్తోందని వివరించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ విద్యార్థుల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించేందుకు సహకారం అందిస్తూ అవసరమైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యారంగంలో విశిష్ట సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం సెక్రటరీ భగవంతయ్య, స్పెషల్ అధికారులు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, దాసి శ్రీనివాస్, మహేందర్, జీ సీడీఓ ఉమారాణి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, ఎంఈఓలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కార్మికుల ఓట్లే కావాలా..
# వైద్యం మాత్రం వద్దా?





**శెనార్తి మీడియా, గోదావరిఖని:**

రామగుండం ప్రాంతంలో మంజూరైన ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని త్వరితగతిన కేటాయించి, నిర్మాణ పనులు ప్రారంభించాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సోమారపు లావణ్య కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పెద్ద సంఖ్యలో కార్మికులు, వారి కుటుంబాలు నివసిస్తున్నందున ఈఎస్ఐ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే వారికి మెరుగైన వైద్య సేవలు అందుతాయని లావణ్య పేర్కొన్నారు. ఆసుపత్రి మంజూరై కొంతకాలం గడిచినా స్థల కేటాయింపు పూర్తికాక నిర్మాణ పనులు ప్రారంభం కాలేదన్నారు. దీంతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు.

**వారం రోజుల్లో స్పష్టత ఇవ్వాలి**

ఈఎస్ఐ ఆసుపత్రికి స్థల కేటాయింపు, నిర్మాణ పనుల ప్రారంభంపై జిల్లా యంత్రాంగం వారం రోజుల్లో స్పష్టత ఇవ్వాలని లావణ్య కోరారు. ఈలోగా సానుకూల స్పందన రాకపోతే పార్టీ తరఫున తదుపరి కార్యాచరణ చేపడతామని తెలిపారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఈ అంశంపై దృష్టి సారించి ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశీపేట శివాజీ, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మామిడి రాజేష్, మాజీ జిల్లా ఉపాధ్యక్షురాలు మాతంగి రేణుక, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వద్దేపల్లి భారతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుల్వ పద్మ, ఉపాధ్యక్షురాలు సుజా శ్రీ, ఎన్టీపీసీ మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీష్, తిలక్ నగర్ మండల అధ్యక్షుడు ఐత పవన్, సీనియర్ నాయకులు కొండపర్తి సంజీవ్, కొమ్మ శ్రీనివాస్ యాదవ్, అరిగేల శ్రావణ్ యాదవ్, పశం రాజు యాదవ్, బరిగల సంతోష్, మేడి రాజు, మంథని మహేష్, కచ్చకాయల శ్రావణ్ పాల్గొన్నారు.

# కాచాపూర్‌లో ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభం

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**





మండలంలోని కాచాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నూతన భవనాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో కాచాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య మౌలిక వసతులను బలోపేతం చేసి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో సేవలందించాలని సూచించారు. అనంతరం శంకరపట్నం మండలానికి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎంపికైన 12 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఊకంటి మాధవీ మధుకర్, తహసీల్దార్ సురేఖ, మాజీ జడ్పీటీసీ, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి, ప్యాక్స్ చైర్మన్లు గోపగోని బస్వయ్యగౌడ్, గాజుల మహేష్, కీసర సంపత్, జిల్లా పార్టీ కార్యదర్శి గట్టు తిరుపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, ఉప సర్పంచుల ఫోరం మండల చైర్మన్ గొట్టె మధు, సర్పంచులు చింతిరెడ్డి పద్మ, కొంకటి రవి, దుర్గపు సుజాత తిరుపతి, కొఎగ్గని శ్రీలత రమేశ్, ఎంపీవో ప్రభాకర్, ఎంఈవో లక్ష్మీనారాయణ, వైద్యాధికారులు డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ శ్రావణి, హౌసింగ్ ఏఈ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ జార్జ్‌లో స్వయం పాలన దినోత్సవం



**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

కొత్తపల్లి పట్టణంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో టీచర్స్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయుల బాధ్యతలు, క్రమశిక్షణ, సమయపాలన, విద్యార్థులను నడిపించే విధానం వంటి అంశాలను ప్రత్యక్షంగా అనుభవించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ పి.ఫాతిమారెడ్డి విద్యార్థులను ఒకరోజు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయుల విలువ, బాధ్యతను విద్యార్థులు మరింత లోతుగా అర్థం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భార్గవ్, టీచర్స్ పాల్గొన్నారు.



## బర్రెల కాపరిని ఢీకొన్న బైక్

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



మండలంలోని మొలంగూర్ బీసీ క్వార్టర్స్ సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. మొలంగూర్‌కు చెందిన వైనాల వీరయ్య (65) బర్రెలను మేపుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. చింతలపల్లి గ్రామానికి చెందిన బొంతల సారయ్య చైతన్య సీడ్ మిల్లులో పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో వీరయ్య కాలుకు తీవ్ర గాయాలై రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఈఎంటీ గూడూరి సతీష్‌రెడ్డి, పైలట్ మత్తి గోపికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడికి అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స అందించి హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# 10,11న మండల స్థాయి క్రీడా పోటీలు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు ఈ నెల 10, 11 తేదీల్లో కేశవపట్నం ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి, మండల క్రీడా చైర్మన్ ఎం. లక్ష్మీనారాయణ తెలిపారు. పోటీల షెడ్యూల్ ఖరారు చేసేందుకు శనివారం తాడికల్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ నెల 10న అండర్–14, అండర్–17 బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. 11న అండర్–14, అండర్–17 బాలురకు ఇదే క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయని మండల క్రీడల కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, అంజలి, వాసు, జస్‌బీర్‌సింగ్, లక్ష్మీపతి పాల్గొన్నారు. ఇతర వివరాలకు మండల క్రీడల కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్‌ను సంప్రదించాలని సూచించారు.

## దాచారం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

మండలంలోని దాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బైర మానస రాజేందర్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని సర్పంచ్ బైర మానస రాజేందర్ అన్నారు. తల్లిదండ్రుల తర్వాత పిల్లలకు మంచి మార్గాన్ని చూపించే గురువులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా సర్పంచ్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్‌లో నియామకాలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మానకొండూర్ ఎమ్మెల్యే, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్‌లో పలువురిని నియమించారు. శంకరపట్నం మండలం ముత్తారం గ్రామానికి చెందిన కనకం విద్యాసాగర్‌ను జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా, గడ్డం సంపత్, బొజ్జ చంద్రమౌళిని సెక్రటరీలుగా నియమిస్తూ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సాగర్, సంపత్, చంద్రమౌళి మాట్లాడారు. తమ నియామకానికి సహకరించిన టీపీసీసీ నాయకుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండారి తిరుపతి, టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ సముద్రాల లక్ష్మణ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తాడికల్ సొసైటీ డైరెక్టర్ ఓడల రాజయ్య, దేవనూరి నరేష్, కనుకుట్ల సాగర్ పాల్గొన్నారు.

# మొలంగూర్ పాఠశాలలో ఘనంగా టీచర్స్ డే



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా మొలంగూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుందని అన్నారు. కాలక్రమంలో విద్యా రంగం, సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ విద్యార్థులకు తగిన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ముందుగా శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి కంకణాల నీరజ ఘన నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ, సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పతనాన్ని వివరించారు. పాఠశాల విద్యాభివృద్ధికి ప్రధానోపాధ్యాయురాలు అందిస్తున్న సహకారం, కృషి, ప్రోత్సాహాన్ని ఉపాధ్యాయులు ప్రశంసించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో ప్రధానోపాధ్యాయురాలు విద్యాసారథి పురస్కారం అందుకున్న సందర్భంగా ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశారు. చివరగా ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజను విద్యార్థులు, ఉపాధ్యాయలు సత్కరించారు.

## విజన్ హై స్కూల్ లో టీచర్స్ డే వేడుకలు

**శెనార్తిమీడియా, కరీంనగర్ :** కొత్తపల్లి మండలం రేకుర్తి విజన్ హైస్కూల్ లో టీచర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ టీచర్స్ ను ఘనంగా సత్కరించి వారికి టీచర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సందవేణి వెంకట్ , ఇంచార్జ్ ప్రతిభా భారతి, టీచర్స్ పాల్గొన్నారు.





# అద్దేపల్లి జీవితం.. ఒక సాహిత్యోద్యమం

## నేడు అద్దేపల్లి రామమోహనరావు జయంతి

తెలుగు సాహిత్య చరిత్రలో చెరగని సంతకం ఆయనది. తెలుగు సాహిత్యంతో విడదీయరాని బంధం, సంబంధం, అనుబంధం ఆయనది. సాహిత్య పరంగా వందలాది యువకులకు స్ఫూర్తినిచ్చి, వారి రచనా పోకడలకు మెరుగులు దిద్దిన సాహితీ వేత్త ఆయన. ఎందరో యువ కవులను ప్రోత్సహించి, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసి, అసలు సిసలైన సాహితీ సరుకును అందించేందుకు దోహద పడిన సాహితీ కర్మాగారం ఆయన. భావజాలం ఏదైనా, భావుకత విషయమే ప్రధానమని నమ్మి, కవులలో పెద్దా, చిన్నా, సాంప్రదాయ, ఆధునిక, పద్య గద్య వచన తేడా లేకుండా అందరితో సమన్వయం, సంబంధం కలిగి, సమాదరించిన గొప్ప మనసు ఆయనది. నమ్మిన బాటలో ముక్కు సూటిగా కొనసాగిన మనస్తత్వం ఆయనది. వేలాదిగా అభిమానులు, అనుయాయులు, అనుచరులు కలిగి ఉన్న మార్గదర్శకుడు. ఆయనే తెలుగు సాహిత్యంలో చెరగని సంతకం చేసిన అద్దేపల్లి రామమోహన రావు. అద్దేపల్లి అర్థ శతాబ్ది సాహితీ ప్రస్థానంలో సుమారు 30 పుస్తకాల్ని వెలువరించి, వందకు పైగా ముందు మాటలు వ్రాసి, వివిధ సభల్లో రెండువేలకు పైగా అధ్యక్షోపన్యాసాలు చేసి, వందలాది పుస్తకాల సమీక్షలు చేసి, వందల తెలుగు గజల్స్ ను వ్రాసి, గానం చేసిన సాహితీ కృషీవలుడు. తెలుగులో మినీ కవితా ప్రక్రియను చేపట్టిన కవుల్లో అద్దేపల్లి ఒకరు. నిజానికి అద్దేపల్లి జీవితం ఒక సాహిత్యోద్యమం.

రామమోహనరావు 1936, సెప్టెంబరు 6న బందరు శివార్లలోని చింతగుంట పాలెంలో పుట్టువు నొందారు. అక్కడే ప్రాథమిక విద్యను అభ్యసించి, సమీపంలోని జవారుపేట హిందూ హైస్కూల్‌లో చదివారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతినుండి ఎం.ఏ.పూర్తి చేసి బందరు హిందూ కళాశాలలో కొంతకాలం ట్యూటర్‌గా, లెక్చరర్‌గా విధులు నిర్వర్తించారు. కొంతకాలం నందిగామలో ఉద్యోగం చేసి 1972లో కాకినాడ చేరుకుని అక్కడే స్థిరనివాసి అయినారు. ప్రారంభ దశలో చందోబద్ధమైన కొన్ని వందల పద్యాల్ని రచించారు. 1960 లో తొలికవిత కృష్ణాపత్రికలో ప్రచురితం అయింది. కాగా తాను విశ్వసించే హేతువాదం, అభ్యుదయ, ప్రగతిశీల భావాలకు గిరిగీసుకున్న సంప్రదాయ ఛందో బద్ధ రీతులు కాక, స్వేచ్ఛాయుత వచన కవిత్వమే సరైనదని భావించి, వచన కవితా మార్గాన్నే పయనించ సిద్ధమైనారు, అలాగే ప్రయాణం కొనసాగించారు. ఆవంత్స సోమసుందర్, శివ సాగర్, చెరబండరాజు, నగ్నముని, కె.శివారెడ్డి వంటి విప్లవ కవుల ప్రభావంతో విప్లవ సాహిత్య రంగాన్ని ఎంచుకున్నారు. మసక బారుతున్న మానవ జీవనంపై కవిత్వం వ్రాసిన తొలి తెలుగుకవి అద్దేపల్లి. ఆయన కవిత్వ సంపుటాలలో అంతర్జ్వాల (1970), రక్త సంధ్య (1978), గోదావరి నా ప్రతిబింబం (1992), పొగచూరిన ఆకాశం, సంఘం శరణం గచ్ఛామి, మెరుపు పువ్వు, గీటురాయి వంటివి పేరెన్నిక గన్నవి. అలా వచన కవిత్వానికి పెద్దపీట వేసి, మినీ కవితల ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచి గొప్ప ప్రాచుర్యాన్ని కలిగించారు. ఆయన అనేక కవితలు వివిధ భాషలలోకి అనువదింప బడ్డాయి. పద్యాలు, గేయాలను శ్రావ్యంగా ఆలపించడమే కాకుండా, స్వయంగా తెలుగులో వందల గజల్ లను రచించడమే కాక, రాగయుక్తంగా ఆలపించి అనేక సభలను రంజింప చేశారు. అద్దేపల్లి నిరంతర సంచార అభిలాషియై, తెలుగు సీమలో అనేక ప్రదేశాలు చుట్టి, తన సాహితీ క్షేత్రాన్ని విస్తరింప చేశారు. విమర్శకునిగా ఆయన స్థానం ప్రత్యేకం. తమదైన శైలిలో... శ్రీశ్రీ మహా ప్రస్థానంపై రాసిన మొదటి విమర్శనా గ్రంథం పలువురి ప్రశంసా పాత్రమైంది. కుందుర్తి వచన కవితా వైభవం, స్త్రీవాద కవిత్వం..ఒక పరిశీలన, గుర్రం జాషువా కవితా సమీక్ష, తెలుగు కవిత్వంపై ఆధునికత, అభ్యుదయ విప్లవ కవిత్వాలు– సిద్ధాంతాలు, శిల్పరీతులు వంటి వివిధ విమర్శనా గ్రంథాలు అద్దేపల్లి కలం నుండి వెలువడ్డాయి. 2001లో తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాహితీవిమర్శకు గాను ప్రతిభా పురస్కారం, ఆయన రాసిన "పొగచూరిన ఆకాశం" కవితా సంపుటికి, తమిళనాడుకు చెందిన ప్రముఖ రచయిత చిన్నప్ప భారతి ఆద్వర్యంలో సాహిత్య పురస్కారం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, ఉమర్ ఆలీషా అవార్డు, సరసం అవార్డు, తిలక్ అవార్డు ఆంధ్రసారస్వత సమితి జీవన సాఫల్య పురస్కారం, తంగిరాల అవార్డు, జాషువా అవార్డు పులికంటి సాహితీ పురస్కారం, బోయి భీమన్న సాహితీ పురస్కారం ఆయనను వరించిన వాటిల్లో కొన్ని. "సాహితీ సంచార యోధుడు"గా, బిరుదాంకితులైన అద్దేపల్లి తెలుగు సాహితీ క్షేత్రానికి సుసంపన్నం చేసి, తనదైన ముద్ర వేసి, 2016, జనవరి 13న తేదీ ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పరమాణు సిద్ధాంతకర్త జాన్ డాల్టన్

## నేడు జాన్ డాల్టన్ జయంతి

ద్రవ్యం, పరమాణువులు, రసాయనిక చర్యలపై అనేక పరిశోధనలు చేసి ఆధునిక పరమాణు సిద్ధాంతానికి పునాదులు వేసిన ఆంగ్ల రసాయన శాస్త్రవేత్త, వాతావరణ శాస్త్రవేత్త మరియు భౌతిక శాస్త్రవేత శాస్త్రవేత్త, జాన్ డాల్టన్. రసాయన శాస్త్రం అభివృద్ధికి, పదార్థాల న్నింటికీ విద్యుత్ ధర్మం ఉందనడానికి, అణుశక్తి వినియోగానికి డాల్టన్ పరమాణు సిద్ధాంతమే బాటలు పరిచింది. ఆయన వాతావరణ శాస్త్రం, వర్ణాంధత్వం మీద కూడా పరిశోధనలు చేశాడు. అణు సిద్ధాంతానికి ఆధునికతను సమకూర్చినవాడుగా చంద్రుడి మీద ఒక క్రేటర్ కు ఈయన పేరు పెట్టారు.

ఇంగ్లండ్ లోని ఈగల్స్ ఫీల్డ్ గ్రామంలో ఓ పేద చేనేత కార్మికుడి అయిదుగురి సంతానంలో ఒకడుగా 1766 సెప్టెంబరు 6న పుట్టిన డాల్టన్ చిన్నతనంలోనే సైన్స్, గణితం, ఇంగ్లిషుల్లో పట్టు సాధించాడు. వాతావరణ శాస్త్రం (మెట్రియాలజీ)పై ఆసక్తి పెంచుకుని పరిశీలనకు కావలసిన పరికరాలను స్వయంగా రూపొందించుకున్నాడు. వాతావరణ పీడనం, ఉష్ణోగ్రత, గాలి వేగం, తేమ లాంటి విషయాలను రోజూ నమోదు చేసుకోవడాన్ని ప్రారంభించి జీవితాంతం కొనసాగించాడు. చనిపోయే చివరి రోజు వరకు ఆయన నమోదు చేసిన అంశాలు 2 లక్షల పైమాటే అంటే ఆయన నిర్విరామ కృషి అర్థం అవుతుంది. స్కూల్లో పిల్లలకు చదువు చెప్పడం, తండ్రికి సాయపడడంతో పాటు లాటిన్, గ్రీకు భాషలు నేర్చుకున్నాడు. పాఠశాల ఉపాధ్యాయుడుగా, వాతావరణ శాస్త్రవేత్తగా, రంగు అంధత్వంపై నిపుణుడుగా రూపుదిద్దుకున్నా,

ఇరవై ఏడేళ్లకల్లా కళాశాల అధ్యాపకునిగా చేరినా పరిశోధనలు మానలేదు. మాంచెస్టర్ లిటరరీ అండ్ ఫిలాసఫికల్ సొసైటీ, ఆయనకు ఉత్తేజపరిచే మేధో వాతావరణం మరియు ప్రయోగశాల సౌకర్యాలను అందించింది. ఇంగ్లండ్‌లోని కొండలు, లోయలు, పట్టణాలు తదితర ఎన్నో ప్రాంతాల్లో వాతావరణాన్ని పరిశీలించి, ఎక్కడైనా గాలి సమ్మేళనం (ఎశీఎజూశీంట్‌అశీఅ) ఒకేలా ఉందని తేల్చుకున్నాడు. అలా ఆయన చేసిన పరిశోధనల ఫలితంగా 'పాక్షిక పీడన సిద్ధాంతం' (ఉష్ట్రవశీతీఎ శీట ూఖతీఞఖశ్రీూతీవంంబతీవం) చెప్పగలిగాడు. ఆపై రసాయన చర్యలపై దృష్టి సారించి పరమాణు సిద్ధాంతాన్ని అందించాడు. పరమాణువులు ఎలా సంపర్కం చెందుతాయో తెలిపేలా మూలకాలకు డాల్టన్ ఏర్పరిచిన సంకేతాలకు ఇప్పటికీ అదే ప్రాధాన్యత ఉంది. అలాగే మూలకాలు సమ్మేళనంగా ఏర్పడే అంశానికి సంబంధించి 'నిర్దుష్ట అనుపాత నియమం' (Law of Definite proportions),



బహుళ అనుపాత నియమం (Law of multiple proportions) నిర్వచించాడు. వాతావరణ పీడనాన్ని సూచించే భారమితి (Barometer), తేమని తెలిపే హైగ్రోమీటర్, మేఘాలు ఏర్పడే విధానాలు, వర్షపాతం, బాష్పీభవనం, తుషారస్థానం (Dew Point) గురించిన పరిశోధనలు డాల్టన్ చేసినవే. తన పరిశోధనలకు ఎన్నో డాక్టరేట్లు, పురస్కారాలు పొందాడు. లావోయిసియర్, అతని అనుచరులు భావించినట్లు గాలి ఒక విశాలమైన రసాయన ద్రావకం కాదని , ఒక మిశ్రమంలో ప్రతి వాయువు ద్వారా వచ్చే ఒత్తిడి స్వతంత్రంగా ఉండే ఒక యాంత్రిక వ్యవస్థ ఇతర వాయువుల ద్వారా ఒత్తిడి, మరియు మొత్తం పీడనం ప్రతి వాయువు పీడనాల మొత్తం అని వివరించాడు. ఏకపక్ష వ్యవస్థను ఉపయోగించి, సమ్మేళనాల శాతం కూర్పుల నుండి పరమాణు బరువులను లెక్కించడం కొన సాగించాడు. మిళితం చేయగల రెండు అంశాలు ఉంటే, వాటి కలయికలు ఒక నిర్దిష్ట క్రమంలో సంభవిస్తాయని పేర్కొన్నాడు. డాల్టన్ తన అణు సిద్ధాంతాన్ని 1808 లో ప్రతిపాదించాడు; సిద్ధాంతాన్ని శాస్త్రవేత్తలు విశ్వవ్యాప్తంగా ఆమోదించడానికి మరో శతాబ్దం గడిచింది.

డాల్టన్ పరమాణు సిద్ధాంతం ప్రకారం... అన్ని పదార్థాలను విడదీయరాని మరియు నాశనం చేయలేని అణువులను విభిన్న ద్రవ్యరాశి మరియు లక్షణాలతో కలిగి ఉంటుందని సూచించింది. దీని కలయిక వాటి మూలకాల యొక్క భౌతిక స్వభావాన్ని నిర్ణయిస్తుంది. ఒక మూలకం యొక్క అన్ని పరమాణువులు ఒకేలా ఉంటాయి. వివిధ మూలకాల అణువులు పరిమాణం మరియు ద్రవ్యరాశిలో విభిన్నంగా ఉంటాయి. పరమాణువుల విభిన్న సంఖ్యా కలయికల ద్వారా సమ్మేళనాలు ఉత్పత్తి చేయబడతాయి. ఆంటోయిన్ లావోసియర్ మరియు జోసెఫ్ ప్రౌస్ట్ రచనలను అధ్యయనం చేయడం, విస్తరించడం ద్వారా డాల్టన్ బహుళ నిష్పత్తిలో నియమాన్ని అభివృద్ధి చేశారు (మొదటి సారిగా 1803 లో సమర్పించారు). వివిధ ఉష్ణోగ్రతలలో గాలి ద్వారా నీటి ఆవిరిని శోషించడం, బాష్పీభవనం, వాయువుల ఉష్ణ విస్తరణపై ఆయనచేసిన కృషి, డాల్టన్ యొక్క పాక్షిక ఒత్తిళ్ల నియమావళికి దారితీసింది. ఇది అణువు యొక్క ఆధునిక సిద్ధాంతం 1803 లో అతని ప్రతిపాదనకు తెలియ జేసింది. ప్రయోగాత్మకంగా, అనుభవ పూర్వక పద్ధతిలో ఫలితాలను పరీక్షించడం ద్వారా డాల్టన్ తన నిర్ధారణలకు చేరుకున్నందున, ఇది అణువు యొక్క మొదటి నిజమైన శాస్త్రీయ సిద్ధాంతాన్ని గుర్తించ బడింది. శాస్త్రవేత్తగా తన ప్రారంభ కెరీర్‌లో, డాల్టన్ రంగు అంధత్వాన్ని కూడా పరిశోధించాడు .ఈ విషయం అతనికి ప్రత్యక్ష అనుభవం ద్వారా సుపరిచితం. పుట్టినప్పటి నుండి ఈ పరిస్థితి అతని మరియు అతని సోదరుడిని ప్రభావితం చేసింది కాబట్టి, అది తప్పనిసరిగా వంశపారంపర్యంగా ఉండాలని డాల్టన్ సిద్ధాంతం చేశాడు. అతను తన సొంత కంటి కణజాలం యొక్క జన్యు విశ్లేషణలో ఆకుపచ్చ రంగును గ్రహించడం కోసం ఫోటోరిసెప్టర్‌ను కోల్పోతున్నట్లు వెల్లడించి నప్పుడు తన సిద్ధాంతాన్ని నిజమని నిరూపించాడు. ఎరుపు – ఆకుపచ్చ రంగు అంధత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఆయన చేసిన కృషి ఫలితంగా, ఈ పరిస్థితిని ఇప్పటికీ "డాల్టోనిజం" అని పిలుస్తారు. డాల్టన్ నిరాడంబరమైన ఉనికిని కొనసాగించాడు. అనేక గౌరవాలను అందు కున్నాడు. డాల్టన్ 1844 లో మరణించే వరకు విస్తృత విషయాలపై తన శాస్త్రీయ పరిశోధనను కొనసాగించాడు. అతను మాంచెస్టర్ లిటరరీ అండ్ ఫిలాసఫికల్ సొసైటీలో క్రియాశీల సభ్యుడిగా,1822 నుండి, రాయల్ సొసైటీలో ఫెలోగా ఉన్నాడు. మాంచెస్టర్‌లో అతని అంత్యక్రియల ఊరేగింపులో 40,000 మందికి పైగా ప్రజలు ఊరేగారంటే ప్రజలకు ఆయనపై గల అభిమానం స్పష్టం అవుతుంది..

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెలుగు గీత కవితకు జీవశైలి ఇచ్చిన వడ్డేపల్లి

## నేడు గేయ గంధర్వుడు వడ్డేపల్లి కృష్ణ వర్ధంతి

తెలుగు భాషా సాహిత్యంలో గేయ సాహిత్యానికి విలక్షణ శైలి, హృదయాన్ని తాకే భావ వృద్ధి, సంగీతానికి తగిన పద సౌందర్యాన్ని అందించిన అరుదైన రచయిత వడ్డేపల్లి కృష్ణ (ఆగస్టు 5, 1948 – సెప్టెంబర్ 6, 2024). లలిత గీతాల నుంచి భక్తి గీతాల వరకు, జానపద గేయాల నుంచి చలనచిత్ర పాటల దాకా అన్ని రంగాలలో తనదైన ముద్ర వేసిన వారు. ఆయన రచనలు వినిపించడమే కాదు, హృదయాన్ని పరవశింప జేసే శక్తిని కలిగి ఉన్నాయి.

1948 ఆగస్టు 5న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో ఒక చేనేత కుటుంబంలో జన్మించిన వడ్డేపల్లి కృష్ణ గారికి చిన్ననాటి నుంచి సాహిత్యం, సంగీతంపై మక్కువ ఉండేది. తల్లిదండ్రులు లక్ష్మమ్మ, లింగయ్యల అనుసంధానంలో పెరిగిన ఆయన చిన్ననాటి నుంచే కవిత్వానికి ఆకర్షితులయ్యారు. సినారె ప్రభావం స్పష్టంగా కనిపించే ఆయన పదబంధాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యం కాలక్రమేణా గేయసాహిత్యానికి సజీవ ముద్రగా మారాయి.

1968లో "స్రవంతి", "కృష్ణా పత్రిక"లలో పద్యాలు, గేయాలు ప్రచురితమవడం ద్వారా ఆయన రచనా జీవితం మొదలైంది. 'కవికల్యాణం', 'గడ్డిపువ్వు', 'గాంధీ', 'మూడుపూలు ఆరుకాయలు', 'సంక్రాంతి లక్ష్మి', 'స్వదేశీయం', 'వివేకానంద విజయం', 'ఆమ్రపాలి', 'బతుకమ్మ', 'జయజయహే తెలంగాణ', 'రమణీయ రామప్ప' వంటి అనేక సంగీత నృత్యరూపకాలు వ్రాసిన ఆయన, జాతీయ, ప్రాంతీయ నేపథ్యాలను భావప్రధానంగా మలచగల గుణాన్ని కలిగి ఉన్నారు.

ఆకాశవాణి ద్వారా ప్రసారమైన ఆయన లలిత గీతాలు సామాన్య శ్రోతల నుండి సాహిత్య ప్రియుల దాకా విశేష ఆదరణ పొందాయి. "ఎందుకో ఈ కళ్లలో", "వచ్చే సాయంకాలం మౌనమే పలుకేలా", "తల్లి నీ చూపే దేవుడయ్యేను" వంటి పాటలు శ్రోతల మధుర జ్ఞాపకాల్లో నిలిచి పోయాయి. 'చిత్రాలకు గీతాలు రచించిన ఆయన, చలన చిత్ర గేయ సాహిత్యంలో సాహిత్య విలువను నిలబెట్ట గలిగిన అరుదైన రచయితగా గుర్తింపు పొందారు. ఆయన టెలివిజన్ సీరియల్స్ కూడా రూపొందించారు, వాటిలో "భక్త కవి పోతన", "భారతీయ సంస్కృతీ శిఖరాలు" ముఖ్యమైనవి. "గోభాగ్యం" లఘు చిత్రానికి జాతీయ స్థాయిలో స్పెషల్ జ్యూరీ అవార్డు కూడా అందుకున్నారు.

అవగాహనతో కూడిన పద వినియోగం, శ్రావ్యమైన పద బలంతో కూడిన రచనలు ఆయన శైలికి ప్రధానంగా నిలిచాయి. ఆయన భక్తి గీతాలు ఆలయాల్లో, భజనల్లో ప్రతిరోజూ వినిపించేవే. ఆయన రచనలు కేవలం వినోదం గానీ, ఆధ్యాత్మిక అనుభూతికే పరిమితం కాకుండా, భావ వ్యక్తీకరణకు, తాత్వికతకు ఆవిష్కారంగా నిలిచాయి.



సంగీతం, పద సౌందర్యం రెండింటికీ సమాన ప్రాముఖ్యత ఇస్తూ రచించగల శక్తి ఆయనకు ప్రత్యేకత నిచ్చింది.

సాహిత్య సేవలకు గుర్తింపుగా ఆయనకు 'నంది అవార్డు', 'తెలుగు యూనివర్శిటీ గౌరవ సత్కారం', సినారె అవార్డు, మల్లాది' స్మారక పురస్కారం, దాశరథి మెమోరియల్ అవార్డు, ఆత్రేయ అవార్డు, వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పురస్కారం, రవీంద్రభారతి' లో గవర్నర్ సమక్షంలో అక్కినేని నాగేశ్వరరావుచే కవి సత్కారం వంటి అనేక పురస్కారాలు లభించాయి. ఆయనకు "గేయ కిరీటి", "లలితశ్రీ", "కవన ప్రజ్ఞ" వంటి బిరుదులు లభించాయి. నంది అవార్డ్స్ కమిటీ చైర్మన్‌గా, ఇంటర్నేషనల్ చిల్డ్రెన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ సభ్యునిగా, "పాడుతా తీయగా" లాంటి కార్యక్రమాల జడ్జిగా కూడా ఆయన సేవలు అందించారు.

వెయ్యికి పైగా లలిత గీతాలను రచించిన ఆయన, "కరీంనగర్ క్షేత్రాలు" అనే ఆడియో సీడీ ద్వారా భక్తి పరంగా ప్రాంతీయ క్షేత్రాలకు విశిష్టతను చాటారు. "వెలుగచ్చింది" అనే నాటకంలో తెలంగాణ భాష, యాస పట్ల ఆయనకు ఉన్న మక్కువను చాటి చెప్పారు. తెలంగాణ భూమికి సంగీతార్పణంగా "జయజయహే తెలంగాణ" అనే నృత్యరూపకం ద్వారా తన చారిత్రక భావనను ప్రతిబింబించారు.

ఆఖరి దశలో అనారోగ్యంతో బాధ పడుతున్న కృష్ణ హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2024 సెప్టెంబరు 6న మరణించారు. ఆయన మరణం తెలుగు గేయ సాహిత్య ప్రపంచానికి తీరని లోటు. కానీ ఆయన రచనలు, గీతాలు, పదాల సుగంధం పుస్తకాలుగా, ఆల్బములుగా, జ్ఞాపకాలుగా జీవించి ఉంటాయి.

వడ్డేపల్లి కృష్ణ ఒక గేయ రచయితగా మాత్రమే కాక, భావ వేధనకు నిలయమైన కవిగా, సమాజ స్పందనలకు ప్రతిరూపమైన సృజన కర్తగా, సంగీతానికి సాహిత్య గంభీరతను నూరిన ప్రకాశమయమైన ప్రతిభావంతుడిగా నిలిచి పోతారు. ఆయన రచనలన్నీ భావితరాలకు శ్రావ్యమైన ఆదర్శంగా నిలవడం ఖాయం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494




# క్రికెట్ పిచ్‌పై భారత్-జపాన్ దోస్తానా!

**టోక్యో, సెప్టెంబర్ 5 :** భారత్, జపాన్ దేశాల మధ్య 75 సంవత్సరాల ద్వైపాక్షిక దౌత్య సంబంధాల వేడుకల సందర్భంగా ఇరుదేశాల పురుషుల జట్లు ప్రత్యేక అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లో తలపడనున్నాయి. ఈ చారిత్రాత్మక పోరు కోసం 'సుజుకి కప్' నిర్వహించనున్నట్లు జపాన్ క్రికెట్ అసోసియేషన్, బిసిసిఐ సంయుక్తంగా అధికారికంగా ప్రకటించాయి. జపాన్‌లోని తోచిగి ప్రిఫెక్చర్‌లో ఉన్న సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా సెప్టెంబర్ 22న ఈ మ్యాచ్ జరగనుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకాఇచిల మధ్య జరిగిన ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందం మేరకు 'స్పోర్ట్స్ 75' పేరుతో ఈ క్రీడా సంబంధాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు కూడా ఈ భాగస్వామ్యం ఊతమివ్వనుంది. అదే సమయంలో జపాన్ వేదికగా జరిగే ఆసియా గేమ్స్‌లో పాల్గొనే భారత పురుషుల జట్టులోని స్టార్ క్రికెటర్లు వైభవ్ సూర్యవంశీ, శ్రేయస్ అయ్యర్ వంటి ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగనున్నారు. ఈ సందర్భంగా బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందిస్తూ.. ఈ అరుదైన మ్యాచ్‌లో భాగస్వామి కావడం బిసిసిఐకి ఎంతో సంతోషాన్ని ఇస్తోందని, తూర్పు ఆసియా ప్రాంతంలో క్రికెట్‌ను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ఇదొక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈఓ నవోకి అలెక్స్ మియాజీ మాట్లాడుతూ.. ప్రపంచ ఛాంపియన్ జట్టును తమ దేశంలో ఆహ్వానించడం గర్వంగా ఉందన్నారు. ఈ మ్యాచ్ ద్వారా ఈస్ట్ ఆసియా మార్కెట్‌లో క్రికెట్ క్రేజ్ పెంచడంతో పాటు, జపాన్‌లో క్రికెట్ మౌలిక వసతుల అభివృద్ధికి బిసిసిఐ సాంకేతిక సహకారాన్ని కూడా అందించనుంది.




# పాకిస్థాన్ టీమ్‌లో 'ఆపరేషన్ క్లీన్-అప్'!

**లండన్, సెప్టెంబర్ 5 :** ఇంగ్లాండ్ దెబ్బకు పాకిస్థాన్ క్రికెట్‌లో భారీ భూకంపం సంభవించింది! లార్డ్స్ మైదానంలో జరిగిన రెండో టెస్టులో 194 పరుగుల తేడాతో దారుణ పరాజయం చవిచూడటంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆగ్రహంతో ఊగిపోతోంది. ఈ అవమానకర ఓటమితో సీరియస్ అయిన బోర్డు, సిరీస్ మధ్యలోనే ఏకంగా ఏడుగురు సీనియర్ ప్లేయర్లపై నిర్దాక్షిణ్యంగా వేటు వేసింది. జట్టు నుంచి తొలగించిన వారిలో మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్-ఉల్-హక్, సల్మాన్ అలీ ఆఘా, అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, అవైస్ జాఫర్, ఖుర్రమ్ షెహజాద్ ఉన్నారు. ఫ్లాప్ ఫార్మ్‌లో ఉన్న సీనియర్లను పక్కనబెట్టి సైమ్ అయూబ్, అబ్దుల్లా షఫీక్‌లతో పాటు అర్ఫాత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బేగ్, మహమ్మద్ ఇమ్రాన్, రజావుల్లా వంటి ఐదుగురు యంగ్ ప్లేయర్లకు తొలిసారి అవకాశం ఇచ్చారు. ఆటగాళ్లతో పాటు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను కూడా పదవుల నుంచి ఊడబీకి సరికొత్త డ్రామాకు తెరతీశారు. మైక్ హెస్సన్, యాసిర్ అరఫాత్‌లకు ఈ పర్యటన ముగిసేవరకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే 0-2తో సిరీస్ కోల్పోయిన పాక్, సెప్టెంబర్ 9 నుంచి జరగబోయే మూడో టెస్టులోనైనా పరువు కాపాడుకుంటుందో లేదో చూడాలి.




# సీఎస్కే కెప్టెన్ మార్పు తప్పదా!

**చెన్నై, సెప్టెంబర్ 5 :** ఇండియన్ ప్రిమియర్ లీగ్ అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ రాబోయే సీజన్ కోసం సంచలనాత్మక నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. గత కొన్ని సీజన్లుగా జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో, మేనేజ్‌మెంట్ జట్టు నాయకత్వంలో మార్పులు చేసేందుకు తీవ్రంగా యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా, ప్రస్తుత సారథి రుతురాజ్ గైక్వాడ్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించి, ఆ స్థానాన్ని వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌కు అప్పగించాలని అనేకమంది క్రికెట్ విశ్లేషకులు మరియు మాజీ ఆటగాళ్లు సూచిస్తున్నారు. చెన్నై సూపర్ కింగ్స్ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా వరుసగా మూడేళ్లపాటు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. ఇది ఫ్రాంచైజీ యాజమాన్యంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. గత 2026 ఐపీఎల్ సీజన్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ వ్యక్తిగత ప్రదర్శన కూడా జట్టుకు ఏమాత్రం కలసి రాలేదు. ఆయన కేవలం 28 సగటుతో 337 పరుగులు మాత్రమే చేసి తీవ్రంగా విఫలమయ్యారు. కెప్టెన్సీ ఒత్తిడి కారణంగానే ఆయన బ్యాటింగ్ తీవ్రంగా ప్రభావితమైందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో, మినీ వేలం లేదా ట్రేడింగ్ ద్వారా జట్టులోకి వచ్చిన సంజూ శాంసన్‌కు నాయకత్వ పగ్గాలు అప్పగిస్తే జట్టు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంజూ శాంసన్‌కు ఐపీఎల్‌లో సారథిగా మంచి అనుభవం ఉందనేది స్పష్టమవుతోంది. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆయన ఏకంగా 66 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించారు. అందులో 50 శాతానికి పైగా గెలుపు శాతాన్ని నమోదు చేయడమే కాకుండా, తన సమర్థవంతమైన నాయకత్వంతో రాజస్థాన్ జట్టును ఫైనల్‌కు కూడా తీసుకెళ్లారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడం, యంగ్ ప్లేయర్లను సరిగ్గా ప్రోత్సహించడం సంజూ శాంసన్ ప్రత్యేకత. తమిళనాడుకు చెందిన మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ సైతం ఈ అంశంపై స్పందిస్తూ.. రుతురాజ్ గైక్వాడ్‌పై నుంచి కెప్టెన్సీ భారాన్ని తొలగిస్తే, ఆయన ఓపెనర్‌గా ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయగలరని వ్యాఖ్యానించారు. చెన్నై జట్టుకు రుతురాజ్ అత్యంత కీలకమైన బ్యాటర్ అని, కెప్టెన్సీ భారం వల్ల ఆయన నాణ్యమైన ఆటను కోల్పోకూడదని బద్రీనాథ్ పేర్కొన్నారు. ఇవే కాకుండా, సీఎస్కే తుది జట్టులో మరికొన్ని కీలక మార్పులు కూడా త్వరితగతిన చేపట్టాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది. రాబోయే సీజన్ నాటికి జట్టులో మిడిల్ ఆర్డర్ బలాన్ని పెంచడంతో పాటు, డెత్ ఓవర్లలో నిలకడగా బౌలింగ్ చేసే పేసర్లను ఎంపిక చేసుకోవడంపై ఫ్రాంచైజీ దృష్టి సారించింది. సంజూ శాంసన్‌కు కెప్టెన్సీ ఇస్తే, అది సీఎస్కే భవిష్యత్తుకు సరికొత్త దిశను నిర్దేశిస్తుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.



# మహమ్మద్ షమీని ధీటుగా ఎదుర్కొంటాం!

**చెన్నై, సెప్టెంబర్ 5 :** దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ పోరు కోసం తాము అన్ని విధాలా సిద్ధమయ్యామని సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ వెల్లడించాడు. సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం చెన్నై వేదికగా ప్రారంభమయ్యే ఈ కీలక ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది. శనివారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడిన తిలక్ వర్మ.. తమ జట్టు తరఫున కేఎల్ రాహుల్ ఆడటం లేదని స్పష్టం చేశాడు. అయితే దేవదత్ పడిక్కల్, మహమ్మద్ సిరాజ్‌లు బరిలోకి దిగుతున్నట్లు తెలిపాడు. "షమీ వేసే లైన్ అండ్ లెంగ్త్ బౌలింగ్‌ను తీవ్రంగా గమనించాం, దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని మా సత్తా చాటుతాం" అని తిలక్ అన్నాడు. కాగా, ఏకంగా 54 సంవత్సరాల తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ ముఖాముఖి తలపడుతున్నాయి. చివరిసారిగా 1970-71 సీజన్‌లో బ్రాబోర్న్ స్టేడియంలో తలపడగా, ఆ మ్యాచ్‌లో సౌత్ జోన్ 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొత్తం మీద సౌత్ జోన్ ఫైనల్ చేరడం ఇది 24వ సారి కాగా, ఇప్పటివరకు 13 టైటిళ్లు గెలుచుకుంది. మరోవైపు 13 ఏళ్ల విరామం తర్వాత ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్, ఇప్పటివరకు 8 సార్లు ఫైనల్స్ ఆడి 2 సార్లు మాత్రమే విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌కు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరుకానున్నారు. అతని పదవీకాలం అక్టోబర్ 4 వరకు ఉన్నప్పటికీ, వచ్చే ఏడాది ప్రపంచకప్ వరకు పొడిగించే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియాతో సమావేశం జరగనుంది. అలాగే రాబోయే ఆసియా గేమ్స్ కోసం నెట్ బౌలర్లుగా మయాంక్ యాదవ్, కార్తీక్ త్యాగి, మొహ్సిన్ ఖాన్‌లకు అవకాశం లభించనుంది.



# యంగ్ పేసర్ ప్రిన్స్‌పై బిసిసిఐ ఫోకస్!

- జస్ప్రీత్ బుమ్రా కంబ్యాక్‌పై కొనసాగుతున్న సస్పెన్స్!
- బుమ్రా బ్యాకప్‌గా యంగ్ పేసర్ ప్రిన్స్!
- గాయాలతో సతమతమవుతున్న టీమిండియా కీలక ప్లేయర్లు!
- ఆటగాళ్లకు త్వరలో మ్యాచ్ సిమ్యులేషన్ టెస్టులు!
- ప్రపంచకప్ ముంగిట భయపెడుతున్న వరుస గాయాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 :** భారత క్రికెట్ జట్టు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా మైదానంలోకి తిరిగి రావడంపై నెలకొన్న ఉత్కంఠకు ఇంకా తెరపడలేదు. గత కొంతకాలంగా మోకాలినొప్పితో బాధపడుతున్న బుమ్రా, ప్రస్తుతం ఫిట్‌నెస్ సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే, బిసిసిఐ (దీజజ×) మెడికల్ టీమ్ నుంచి ఆయనకు ఇప్పటివరకు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ క్లియరెన్స్ లభించలేదు. రాబోయే అఫ్గానిస్థాన్ టి20 సిరీస్ అలాగే 2026 ఆసియా క్రీడల భారత స్క్వాడ్‌లో బుమ్రా పేరును చేర్చినప్పటికీ, ఆయన తుది జట్టులో ఆడటం అనేది కేవలం ఆయన ఆరోగ్య పరిస్థితి మరియు ఫిట్‌నెస్‌పైనే ఆధారపడి ఉంటుందని బోర్డు వర్గాలు స్పష్టం చేశాయి. జూలై 16న ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డే మ్యాచ్ తర్వాత బుమ్రా మళ్లీ పూర్తిస్థాయిలో బౌలింగ్ చేయలేదు. ఆయన కోలుకోవడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో, బిసిసిఐ సెలెక్టర్లు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే యంగ్ ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్‌ను బుమ్రాకు బ్యాకప్ పేసర్‌గా పరిశీలిస్తున్నారు. దేశవాళీ క్రికెట్‌లో వరుసగా రాణిస్తున్న ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం ఇస్తే, అంతర్జాతీయ స్థాయిలో ఆయన సేవలు ఉపయోగపడతాయని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మరోవైపు, కేవలం బుమ్రా మాత్రమే కాకుండా భారత జట్టులోని మరికొందరు కీలక ఆటగాళు కూడా గాయాల బారిన పడటం జట్టు యంత్రాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, మరియు సాయి సుదర్శన్ ప్రస్తుతం గాయాల నుంచి కోలుకుంటున్నారు. వీరి ఫిట్‌నెస్‌ను కచ్చితంగా అంచనా వేసేందుకు నేషనల్ క్రికెట్ అకాడమీ (చీజూా) ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ప్రత్యేక మ్యాచ్ సిమ్యులేషన్ టెస్టులను నిర్వహించనున్నారు. ఈ కఠినమైన పరీక్షల్లో ఫిట్‌నెస్ నిరూపించుకున్న ఆటగాళ్లు మాత్రమే సెప్టెంబర్ 10న ఢిల్లీ చేరుకునే భారత జట్టుతో కలిసి ప్రయాణిస్తారు. ఈ పరిణామాలపై భారత మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బుమ్రా వంటి కీలక బౌలర్ తరచూ గాయాలపాలవడం జట్టు సమతుల్యతను దెబ్బతీస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ ఉన్న నేపథ్యంలో, ప్రధాన బౌలర్లు నిలకడైన ఫిట్‌నెస్‌తో ఉండటం చాలా అవసరమని పేర్కొన్నారు. ముఖ్యమైన టోర్నీలకు ముందు కీలక ఆటగాళ్లు దూరం కావడం అభిమానులతో పాటు జట్టు యాజమాన్యానికి పెద్ద సవాలుగా మారింది.







# 200 కోట్ల క్లబ్‌లో రవితేజ 'ఇరుముడి'

మాస్ మహారాజ్ రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఫలితంగా ఈ చిత్రం రూ.200 కోట్ల వసూళ్లను రాబట్టినట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే, ఈ చిత్రం ఇంతటి భారీ విజయానికి గల కారణాలను పరిశీలిస్తే, ఎక్కువగా మాస్ యాంగిల్‌లో కనిపించే రవితేజ ఇందులో భిన్నమైన పాత్రలో కనిపించారు. సాధారణ మధ్యతరగతి తండ్రి (త్రినాథ్)గా కనిపించారు. కూతురి ప్రేమకోసం పరితపించే తండ్రిగా భావోద్వేగభరితమైన నటనతో ఆకట్టుకున్నారు. ఆయన అభినయం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగు ప్రజలకు, ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులకు బాగా తెలిసిన ఇరుముడి దీక్ష గురించి ఈ సినిమాలో చూపించారు. ఈ అంశం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. తన ప్రాణమైన కూతురు మణెమ్మ (బేబీ నక్షత్ర) కోసం రవితేజ 41 రోజుల అయ్యప్ప దీక్షను స్వీకరిస్తారు. ఆ దీక్ష ఆయన జీవితాన్ని ఎలా మార్చిందనేది కథలో కీలకమైన అంశం. ఈ రెండు అంశాలకు తోడు సెంటిమెంట్‌తో పాటు ఊహించని మలుపులు, క్లైమాక్స్ ట్విస్ట్ ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేశాయి. ఇది కూడా సినిమా విజయానికి ఓ కారణంగా చెప్పొచ్చు. అలాగే, ఓ తండ్రిగా తన కూతురిపై ప్రేమ చూపించడమే కాదు, సమాజంలో అమ్మాయిలకు జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా హీరో పోరాటం చేయడం కూడా ప్రేక్షకులను కదిలించింది.ఇతపోతే, చివరగా తెలుగు ప్రజలకు బాగా సుపరిచితమైన 'మల్లెపూల పల్లకి' పాటను ఈ సినిమాలో చూపించడం ప్లస్ పాయింట్. అభిమానులు ఆ పాటకు థియేటర్లలో భజనలు చేశారు. 'యాలాలో.. యాలాలో', 'కార్తీకమాసం' పాటలూ ఆకట్టుకున్నాయి. ఇలా అన్ని అంశాలు కలిసిరావడంతో ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ మూవీగా నిలిచింది.

# 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' ట్రైలర్ రిలీజ్




'బేబీ' మూవీ సక్సెస్ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా రాబోతున్న కొత్త సినిమా 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'. ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఈ మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా చిత్ర ట్రైలర్ రిలీజ్ చేసి సినిమాపై అంచనాలు పెంచారు.

# 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి

ప్రస్తుతం యువతలో బాగా ట్రెండ్ అవుతున్న 'డెలులు' అనే పదమే టైటిల్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'డెలులు'. క్రియేటివ్ లాంచ్‌ప్యాడ్ బ్యానర్‌పై సంకీర్త్ కొండ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రీతం కస్తూరి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ రాజ్‌కుమార్ కథ, అదనపు సంభాషణలు అందించగా.. రెష్మిత్ ఎస్. కౌశిక స్క్రీన్‌ప్లే, సంభాషణలు రాశారు. టైటిల్ నుంచే విభిన్నంగా అనిపిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. యువతరం నటీనటులతో తెరకెక్కుతున్న 'డెలులు' మూవీ టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఒక నిమిషం 32 సెకండ్ల నిడివి ఉన్న ఈ టీజర్.. 'బ్రేకప్ దేవా' అనే డైలాగ్‌తో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత వచ్చే సన్నివేశాలు, పాత్రల మధ్య జరిగే సరదా సంభాషణలు టీజర్‌కు మంచి ఫన్ టచ్‌ను తీసుకొచ్చాయి. టీజర్‌లోని పలు డైలాగ్స్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. 'ఆడదానివైన నువ్వు.. చీప్‌గా ఓ మగాడి కోసం మారతావా అంటావా.. సెల్ఫ్ రెస్పెక్ట్ లేదా నీకు', 'నువేమైనా ఫాదర్ ఆఫ్ ఇండియానా?', 'నువ్వు అత్తాపూర్‌కు రారా.. నీళ్ల ట్యాంకర్ దగ్గర ఆడోళ్లతో కొట్టిస్తా', 'కుక్కకు పుట్టినవా నువ్వు' వంటి డైలాగ్స్ టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఈ డైలాగ్స్, కామెడీ సన్నివేశాలు సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఓ ఇంటి నేపథ్యంలో చోటుచేసుకునే సరదా సంఘటనలు, పాత్రల మధ్య కెమిస్ట్రీ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కామెడీతో పాటు కుటుంబ ప్రేక్షకులను అలరించే అంశాలకు కూడా సినిమాలో ప్రాధాన్యత ఇచ్చినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. మొత్తంగా టీజర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్‌కు మంచి స్పందన రాగా.. తాజాగా వచ్చిన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. సాంకేతికంగా కూడా 'డెలులు'కు మంచి బృందం పనిచేస్తోంది. జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. హరికృష్ణ కురపాటి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆది చెబ్రోలు సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో సంగీతం కూడా సన్నివేశాలకు తగ్గట్టుగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో విజయ్ రాజ్‌కుమార్, వేణి రావు, అఖిల్ జాక్సన్, సాయి ప్రసన్న, శ్రీ రామ మండవ, అభినయ్ తుల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యువతను టార్గెట్ చేసే ఫన్, కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలతో 'డెలులు' చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. టీజర్‌కు వస్తున్న స్పందనతో 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. విభిన్నమైన టైటిల్, కామెడీతో కూడిన కథనం, ఫన్ ఎలిమెంట్స్ సినిమాకు ప్లస్‌గా మారే అవకాశముంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా హీరో మాట్లాడుతూ.. నా సినిమాలో దమ్ము లేకుంటే విమ్ముకొని నిలబడ్డా ఎవ్వడూ చూడడు.. కాంట్రవర్సీలతో కాదు కంటెంట్ తో వస్తున్నాం. కేవలం కంటెంట్ బలంతోనే మా సినిమా నిలబడుతుంది కానీ ప్రమోషన్స్ లో ఎలాంటి కాంట్రవర్సీలకు పోయే ప్రసక్తే లేదు అని అన్నారు.





# తమన్నాకి ఆ హీరో ప్రపోజ్ చేసాడా?

మిల్కీబ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ప్రధానంగా తన ఫోకస్‌ను హిందీ చిత్ర పరిశ్రమపైనే పెట్టారు. ఐటెం సాంగ్స్‌తో పాటు హీరోయిన్‌గానూ ఆమెకు అవకాశాలు క్యూకడుతున్నాయి. విజయ్ వర్మతో బ్రేకప్ తర్వాత కెరీర్, వ్యాపారాలపై సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదిలాఉండగా ఓ స్టార్ హీరో వేదిక మీదే తమన్నాకు ప్రపోజ్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. లస్ట్ స్టోరీస్ 2 సమయంలో తన సహనటుడు విజయ్ వర్మతో తమన్నాకి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ కొన్నాళ్లు సీక్రెట్‌గా డేటింగ్ చేశారు. సినిమా ఫంక్షన్లు, ఈవెంట్స్, విహారయాత్రలతో తమన్నా - విజయ్ హల్‌చల్ చేశారు. కానీ ఎక్కడా కూడా తమ బంధాన్ని బయటపెట్టలేదు. ఆ తర్వాత నెమ్మదిగా ఇద్దరూ ఓపెన్ అయ్యారు. రేపో మాపో పెళ్లి అనుకుంటుండగా తమన్నా - విజయ్ వర్మలు అనూహ్యంగా విడిపోయారు. వీరి మధ్య బ్రేకప్‌కు దారి తీసిన కారణాలు ఏంటన్నది మాత్రం తెలియరాలేదు. కెరీర్‌లో నిలదొక్కుకోవాలని విజయ్ వర్మ.. పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని తమన్నా నిర్ణయించుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా బాలీవుడ్ మీడియా కోడై కూసింది. బ్రేకప్ తర్వాత తమన్నా- విజయ్‌లు వారి జీవితాల్లో బిజీ అయ్యారు. సినిమాలు, షూటింగ్స్, బిజినెస్ ఇతర వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ఈ బాధ నుంచి బయటకు రావడానికి సినిమాలను పెంచారు తమన్నా. అలాగే ఇప్పటి వరకు గ్లామరస్ రోల్స్ చేసిన నో కిస్ రూల్‌ను పక్కాగా ఫాలో అయిన ఈ ముద్దుగుమ్మ.. ఈ నిబంధనను కూడా పక్కనపెట్టారు. ఇంటిమేట్ సీన్స్, బెడ్ సీన్స్‌లో నటించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. దీనికి తగినట్లుగానే రాగిణి ఎంఎంస్ 3 వంటి బోల్డ్ సినిమాలో నటించేందుకు అగ్రిమెంట్ మీద సంతకం చేసింది. ప్రస్తుతం తమిళంలో పురుషన్, హిందీలో వీవాన్ ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్, వీ శాంతారామ్ బయోపిక్, రోహిత్ శెట్టి, జగన్ శక్తిలు తెరకెక్కించనున్న సినిమాలలో తమన్నా నటిస్తున్నారు. ఇవి కాకుండా మరిన్ని ప్రాజెక్టులు చర్చల దశలో ఉన్నాయి. అన్నింటిలోకి సిద్ధార్థ్ మల్హోత్రా సరసన నటిస్తోన్న వీవాన్ ఫోర్స్ ది ఫారెస్ట్ ముందు రిలీజయ్యే అవకాశం ఉంది. తాజాగా కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఈ సినిమాలోని సమఝోనా అనే పాటను విడుదల చేశారు. ఈ సాంగ్ లాంచ్ కార్యక్రమం శుక్రవారం ముంబైలో జరిగింది. ఈ సందర్భంగా సిద్ధార్థ్- తమన్నాల కెమెస్ట్రీ అదిరిపోయింది. సమజోనా పాటను పాడుతూ.. మోకాళ్లపై కూర్చోని తమన్నాకు ప్రపోజ్ చేస్తున్నట్లుగా సిద్ధార్థ్ ఉండగా.. మిల్కీబ్యూటీ చిరునవ్వులు చిందిస్తూ సిగ్గుపడింది. అలాగే షూటింగ్ సమయంలో జరిగిన కొన్ని సంఘటనలను సిద్ధార్థ్ పంచుకున్నారు.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644